ఆంధ్రజ్యోతి
**** గరిష్ఠం 29.5 కనిష్ఠం 21.0
ANDHRAJYOTHY



నల్లగొండ
5
గురువారం 6 నవంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	44,217	44,217
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	3936.22	3936.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

హరహర మహాదేవ



కార్తీక వెలుగుల్లో నల్లగొండ పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయం



ప్రత్యేక అలంకారంలో శివలింగం



ఛాయా సోమేశ్వరాలయంలో కార్తీక దీపాలను కొలనులో వదులుతున్న మహిళలు

హరహర మహాదేవ శంభోశంకర అంటూ జిల్లా మార్మోగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచే ఆలయాలు కిక్కిరిశాయి. సూర్యోదయం కంటే ముందే ఆలయాలకు పోటెత్తిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఓ నమఃశివాయ అంటూ కార్తీక దీపాలు వెలిగించారు. కోరిన కోర్కెలు తీరాలంటూ దీపాలను కొలనుల్లో వదిలారు.

నిండు చందురుడి దరహాసం

భువనగిరి ఖిల్లాపైనుంచి చంద్రుడి కాంతులు



నిర్మలమైన ఆకాశంలో నిండు చందురుడి దరహాసం అబ్బురపరిచింది. పౌర్ణమి కాంతులీనుతూ కనురెప్ప వాలనీయలేదు. ఆకాశంలో ఈ సుందర దృశ్యాన్ని జిల్లా ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. బుధవారం భువనగిరి ఖిల్లా సిగలో ఆ చందమామ అందాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

షరతుల్లేకుండా ధాన్యం, పత్తి కొనాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నకిరేకల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని, పత్తిని ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో బుధవారం జరిగిన పార్టీ నియోజకవర్గస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం, పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతుల పంటను మద్దతు ధరతో వెంటనే కొనుగోలు చేయాలన్నారు. డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభలో కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీపీఐ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలి పోతుందన్నారు. వందేళ్ల క్రితం ఏర్పడిన సీపీఐ ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిందని, తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర పోషించిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్, గౌని లక్ష్మీనర్సయ్య, బుడిగె సైదులు, జిల్లా యాదయ్య, శంకర్, ఎండీ అక్బర్, పాల్వాయి విద్యాసాగర్, జిల్లా సత్యం, శ్రీనివాస్, ఎస్‌కే షరీఫ్, తీగల మల్లారెడ్డి, బోడ మల్లేష్, జంగయ్య, మల్లయ్య, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

కలిసి రాని కాలం

- పడిపోయిన వరి దిగుబడులు
- కోత యంత్రాల కొరతతో అవస్థలు
- ప్రకృతి వైపరీత్యాలతో కునుకు కరవు



6



పత్తి కొనుగోళ్లు షురూ..

జిల్లాలో పత్తి కొనుగోళ్లు షురూ కానున్నాయి. జిన్నింగ్ మిల్లులలో పత్తిని యథావిధిగా కొనుగోలు చేస్తామని, ఎలాంటి సమ్మె చేయబోమని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో జరిగిన సమావేశంలో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ఒప్పుకున్నాయి. దీంతో జిల్లాలో పత్తి కొనుగోళ్లు నేటి నుంచి ఆరంభం కానున్నాయని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి తెలిపారు. - (ఆంధ్రజ్యోతి -నల్లగొండ)

● సమ్మె విరమించిన జిన్నింగ్ మిల్లుల యాజమాన్యం

పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వ్యవహరిస్తున్న తీరుతోపాటు పలు నిబంధనలతో ఓ వైపు రైతులు.. మరో వైపు జిన్నింగ్ మిల్లుల యజమానులు అయోమయంలో పడ్డారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలలో అలాంట్‌మెంట్, యాప్ రిజిస్ట్రేషన్, తేమశాతం పరిమితివంటి నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఈ సారి కొంత ఆలస్యం కావడం, ఆపై కురిసిన వర్షాలతో దిగుబడులు తగ్గడం, చివరకు అకాల వర్షాలతో తడిసిన పత్తికి.. తేమశాతం పెరగడం వంటి కారణాలు రైతులను కుంగదీస్తున్నాయి. అధికారులు ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లు వస్తుందని భావించారు. మొత్తం సాగులో 57లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడి రానుందని అంచనా వేశారు. అయితే అకాల వర్షాలు రైతులను నిండా ముంచాయి. ఎకరాకు కనీసం నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లు దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. దిగుబడి తగ్గడానికి తెగులు కూడా కారణమైంది.

తిరకాసు పెడుతున్న సీసీఐ...

అసలే దిగుబడులు తగ్గి, భారీ వర్షాలు.. మొంథా తుపాన్‌తో నష్టపోయి ఆందోళనలో ఉన్న సమయంలో సీసీఐ రోజుకో నిబంధన తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ వ్యవహారం జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలను సైతం ఇబ్బందులకు గురి చేసే విధంగా ఉంది. ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలను ఎత్తివేయాలని, యాప్ రిజిస్ట్రేషన్ నిబంధనలు సడలించాలని పత్తి మిల్లుల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనికితోడు ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాల్సిన సీసీఐ ఏడు క్వింటాళ్ల వరకే పత్తి కొనుగోలు చేస్తామని ప్రకటించడం కూడా రైతులకు ఇబ్బందిగా మారింది. గత సీజన్‌లో ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సీసీఐ ఈ సారి 5 క్వింటాళ్లు తగ్గించడంతో రైతులు....

- మిగతా 8వ పేజీలో...

తెల్లబోయిన పత్తి రైతు

- వర్షాలకు తగ్గిన దిగుబడి
- నల్లగా మారిన తెల్లబంగారం
- తేమ పేరుతో కొనుగోలు చేయని సీసీఐ



పెండ్లిపాకల గ్రామంలో నీట మునిగిన పత్తి

(ఆంధ్రజ్యోతి-కొండమల్లేపల్లి): భారీ వర్షాలకు పత్తి రైతులు తెల్లబోతున్నారు. వరుస వర్షాలకు పత్తి నల్లగా మారడంతోపాటు తేమ శాతం అధికంగా ఉండటంతో కొనుగోళ్లు చేయడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో పడిపోయారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలవ్యాప్తంగా ఇటీవలి భారీ వర్షాలకు పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. పత్తి దిగుబడిని సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్తే తమే శాతం అధికంగా ఉందని కొనుగోలు చేయలేదని రైతులు తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ కారణంగా పంట చేను మునిగి నల్లబారింది. మరోవైపు పత్తి ఏరేందుకు కూలీల కొరత రైతులను వేధిస్తోంది. పత్తి ఏరడానికి కిలోకు రూ.20 ఇస్తామని చెప్పినా ఎవరూ రావడం లేదు. పూత దశ నుంచే పంటకు తెగులు సోకడంతో, వర్షాల ప్రభావంతో రైతుల ఆశలు నిరాశగా మారాయి. గతంలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల పత్తి వచ్చేదని, ఈ ఏడాది వర్షాలకు ఎకరానికి 7 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కష్టంగా మారిందంటున్నారు. దీంతో పెట్టుబడులు రాక అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు వరి పంటను దారుణంగా దెబ్బతీశాయి. కోతకొచ్చిన పంట నేలకొరిగింది.

సురక్షిత నీటి సరఫరా దిశగా..

● డ్రింక్ డైరెక్ట్ ఫ్రమ్ ట్యాప్ విధానానికి చర్యలు



ఖమ్మంలో డీఎఫ్‌టీ విధానం అమలుకు ఇంజనీర్లతో చర్చిస్తున్న మునిసిపల్ కమిషనర్(ఫైల్)

పట్టణ ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేందుకు మునిసిపల్‌అధికారులు చర్యలు చేపట్టారు. డ్రింక్ డైరెక్ట్ ఫ్రమ్ ట్యాప్ విధానం ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విధానంలో తొలుత నీటిని మరిగించిన అనంతరం ఫిల్టర్ చేసి సరఫరా చేస్తారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణ ప్రజలకు కృష్ణా జలాలను మునిసిపల్ కుళాయిలు, మిషన్ భగీరథ నల్లాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఆ నీటిలో కలుషితాలను నివారించడంతోపాటు ఆరోగ్యానికి అవసరమైన మినరల్స్‌ను కలిపేందుకు మునిసిపల్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి మునిసిపాలిటీకి మంజూరైన రూ. 16.70కోట్లలో డీడీఎఫ్‌టీ విధానానికి రూ.1.70కోట్లు కేటాయించినట్లు సమాచారం.

డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానం..

డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానం దేశంలోని మెట్రో పాలిటన్ సిటీల్లో అమలవుతోంది. ఒడిశా రాష్ట్రంలో డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ మిషన్ పేరుతో తాగునీటి సరఫరా జరుగుతోంది. భువనేశ్వర్, కటక్ నగరాల్లో డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానంలో నీటిని సరఫరా చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే ఎనిమిది నగరాల్లో 2.5 మిలియన్ జనాభాకు డీఎఫ్‌టీ విధానంలో డ్రింకింగ్ వాటర్ అందుతుండటం గమనార్హం.కాగా రాష్ట్రంలోని కరీంనగర్, ఖమ్మం పట్టణాల్లో డ్రింక్ డైరెక్ట్ ఫ్రమ్ ట్యాప్ విధానం అమలుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనేపథ్యంలో ఖమ్మంలో జరుగుతున్న డీఎఫ్‌టీ విధానాన్ని కమిషనర్ శ్రీనివాస్ మునిసిపల్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో కలిసి పరిశీలించారు.

నిర్వహణ కష్టతరమే..

డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానం అమలు కష్టతరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు సీజన్లకు అతీతంగా నీటి నిల్వలు సమృద్ధిగా ఉండాలి. అదనపు మోటార్ పంపులు, హౌస్‌హోల్డ్ ఫిల్టర్లు అవసరముంటాయి. నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడంతోపాటు, అదనపు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించాల్సి ఉంటుంది. 24/7 నీటి సరఫరాలో మంచినీటి వృథా జరుగుతుందని, అందుకు ప్రతి ఇంటికీ వాటర్ మీటర్లు బిగించాల్సి ఉంటుంది. నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచాల్సిన అవసరముంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఖమ్మంలో పర్యటించాం

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో అమలవుతున్న డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానాన్ని ఇంజనీర్ల బృందంతో కలిసి పరిశీలించాం. పట్టణ ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు పక్షంరోజుల్లో స్పెషల్ టీమ్ పట్టణానికి వచ్చి పరిశీస్తుంది. సమగ్ర నివేదిక రూపొందించిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తాం.



జీ. శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

చెర్వుగట్టులో గిరి ప్రదక్షిణ ప్రారంభం

- వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు
- కార్యరూపానికి పూర్వ అర్చకుడు పోతులపాటి సోమశర్మ సంకల్పం



వీహెచ్‌పీ ఆధ్వర్యంలో చెర్వుగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కాకుండా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ గిరిప్రదక్షిణను కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రారంభించారు. రాజగోపురం మెట్ల మార్గం వద్ద ఉన్న నంది సర్కిల్ నుంచి గిరిప్రదిక్షణను దేవస్థాన ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. దేవునిబావి, నల్లచెర్వు కట్ట మీదుగా అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఎల్లారెడ్డిగూడెం బస్టేజీ వద్ద ఉన్న ఆర్చి వరకు వెళ్లి చెర్వుగట్టు గ్రామానికి వెళ్లే రోడ్డు ద్వారా నడక సాగిస్తూ పార్వతీ అమ్మవారి గుడి ముంగిట నుంచి తిరిగి మెట్ల మార్గం రాజగోపురం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఘాట్‌రోడ్డు మీదుగా గుట్టపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ గిరిప్రదక్షిణ ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్‌పీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట భానుప్రసాద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గిరిప్రదక్షిణకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. హిందూ సంస్కృతిని, సంప్రదాయాలను, క్షేత్ర ప్రాశస్త్యాన్ని ఇనుమడింపజేసేలా రానున్న రోజుల్లో గిరిప్రదక్షిణ కొనసాగనుందని ఆకాంక్షించారు. కాగా చెర్వుగట్టు దేవస్థానంపై వసతుల కొరత తీవ్రంగా ఉందని, భక్తులకు కనీస వసతులు కల్పించలేని దుస్థితిలో ఆలయ అధికారులు, ఎండోమెంట్ వ్యవస్థ ఉందని ఆరోపించారు. కాగా ప్రతీ పౌర్ణమి, అమావాస్య తిథుల్లో నెలకు రెండు పర్యాయాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించామని గిరిప్రదక్షిణకు నాయకత్వం వహించిన వీహెచ్‌పీ ధర్మాచార్య సంపర్క్ విభాగ్ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కర్నాటి యాదగిరి, యెలిజాల నర్సింహ్మ, వెంకటయ్య, సంపత్, రమేశ్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, అశోక్,చిట్టి, శంకర్ పాల్గొన్నారు.

కార్యరూపంలోకి సోమశర్మ సంకల్పం



(ఫైల్)

చెర్వుగట్టు దేవస్థాన అనువంశిక పూర్వ విశ్రాంత అర్చకుడు.. పుట్టుకతోనే అంధుడైన దివంగత పోతులపాటి సోమశర్మ గిరిప్రదక్షిణ సంకల్పం కాస్త ఆలస్యమైనా కార్యరూపం దాల్చింది. చెర్వుగట్టులో గిరిప్రదక్షిణ ఉత్సవం నిర్వహించాలని వికారి నామ సంవత్సరం 2020 జనవరి 22,23 తేదీల్లోనే అంకురార్పణ చేశారు. అయితే దేవస్థానం ఆధ్వర్యంలో కాకపోగా వీహెచ్‌పీ చేపట్టిన గిరిప్రదక్షిణ కార్యక్రమంతో సోమశర్మ సంకల్పం ఈ విధంగానైనా నెరవేరిందని ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్లేష్



సమావేశంలో మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయితీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయితీ పరిధిలోని ప్రజలకు అన్నిరకాల సేవలను అందిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో చాలీచాలనీ జీతంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. శ్రమకు తగిన వేతనాలు అందించాలని, యూనియన్ తరఫున అనేక మార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. మరోవైపు కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వాలు రోజుకు ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటలపాటు పని చేయిస్తున్నాయన్నారు. పెరిగిన ధరల దృష్ట్యా ప్రభుత్వం వేతనాలు పెంచాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారంకోసం ఉద్యమాలను చేపట్టాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ నాయకులు జిల్లా సైదులు, బుచ్చయ్య, శ్రీనివాసరెడ్డి, దుర్గయ్య, నిమ్మల కోటి సైదులు, రవి, కోటయ్య, శ్రీను, మంద ఏసు, సైదులు, శివ, వీరయ్య, వెంకన్న, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు పైపైకి



సూర్యాపేటటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తోన్న వర్షాల ప్రభావం కూరగాయల ధరపై పడింది. మొంథా తుపాన్‌తో వరి, పత్తి పంటలతో పాటు కూరగాయల పంటలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 15 రోజుల నుంచి కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో మధ్యతరగతి, పేద ప్రజలు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబానికి సరిపోను కూరగాయల కోసం రూ.400 ఖర్చు చేసినా మూడు రోజులకు కూడా సరిపోవడంలేదు. దీనికి తోడు కార్తీకమాసం కావడంతో ఎక్కువగా శాఖాహారం తింటుండటం, వివిధ మాలల ధారులతో వినియోగం పెరిగింది. పెరిగిన ధరలతో కొనాలన్నా ఒకటికీ రెండుసార్లు ఆలోచించుకునే పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వారసంతల్లోనూ కూరగాయల ధరలు మండిపోతున్నాయి.సూర్యాపేట మార్కెట్‌కు చివ్వెంల, ఆత్మకూరు(ఎస్), పెన్‌పహాడ్ మండలాలతో పాటు నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం, హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతాయి. తుపాన్ ప్రభావంతో పంటలుదెబ్బతినడంతో దిగుబడి తగ్గి ధరలు పెరుగుతున్నాయి.

భగ్గుమంటున్న ఉల్లి ధర

ఉల్లి ధరలు భగ్గుమంటున్నాయి. గతంలో రూ.20 నుంచి 25లోపు ఉన్న ధర 15రోజుల నుంచి రూ.35దాకా చేరుకుంది. మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి అత్యధికంగా ఉల్లిగడ్డ ఎగుమతి అవుతుంది. ఎగువన వర్షాలకు తోడు ఉల్లి సాగు లేకపోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు వాపోతున్నారు.

బస్సు కోసం.. విద్యార్థుల పాట్లు

యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని విద్యార్థులు బస్సు కోసం నానాపాట్లు పడుతున్నారు. పుట్టగూడెం గ్రామానికి చెందిన 55 మంది, కొండ్రెడ్డిచెరువు గ్రామం నుంచి 47 మంది, నర్సాపురం నుంచి 33 మంది రాజాపేట ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లేందుకు యాదగిరిగుట్ట డిపో నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. కాగా బస్సు సక్రమంగా రావడం లేదు. ఒక్కోసారి విద్యార్థులు సాయంత్రం ఏడు గంటల వరకు వేచిచూడాల్సి వస్తోంది. ఒక్కోసారి బస్సును అర్ధాంతరంగా రద్దు చేయడంతో ఇంటికి చేరుకునేందుకు విద్యార్థులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు.

– (ఆంధ్రజ్యోతి-రాజాపేట)





పుట్టగూడెంకు వ్యాన్‌లో కిక్కిరిసి వెళుతున్న విద్యార్థులు

వృక్షం చెబుతున్న పాఠం

యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పడమటిసోమారం గ్రామ శివారులో రాతిబండను చీల్చుకుంటూ ఎదిగిన మర్రిచెట్టు అందరినీ ఆకర్షిస్తోంది. జీవితంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని చీల్చుకుంటు ఎలా ఎదగాలోఈ వృక్షం చెబుతున్నట్లుగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

– (ఆంధ్రజ్యోతి -బీబీనగర్)



భర్త మందలించాడని
ఆత్మహత్య

కనగల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భర్త మందలించాడని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. నల్లగొండ జిల్లా కనగల్ ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమ్మగూడెం గ్రామానికి చెందిన సింగం నరేష్ తన నాలుగు ఎకరాల భూమిలో సాగుచేసిన వరి పంటను కోసి పొలం వద్దనే ధాన్యం రాశిని ఏర్పాటు చేశాడు. కాగా ఆ రాశులపై టార్పాలిన్ పట్టాలు కప్పకపోవడంతో వరుసగా కురిసిన వర్షాలకు ధాన్యం తడిసింది. పట్టా కప్పి ఉంటే ధాన్యం తడిసేది కాదని నరేష్ తన భార్య భారతిని మంగళవారం మందలించాడు. ఈ విషయంలో కొద్దిసేపు గొడవ జరిగింది. అనంతరం నరేష్ ఇంటి నుంచి పనినిమిత్తం బయటికి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో భారతి క్షణికావేశంలో ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది.కొద్దిసేపటికి పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన నరేష్ భార్యను చూసి ఇరుగు పొరుగు వారికి విషయం తెలపగా వారు పోలీసులకు సమాచారం అందజేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం భారతి మృతదేహాన్ని బంధువులకు అందజేశారు. మునుగోడు మండలం పులిపలుపులకు చెందిన భారతి తల్లి పుల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వివరించారు. కాగా నరేష్, భారతి దంపతులకు 15 ఏళ్ల లోపు ముగ్గురు పిల్లలున్నారు. తల్లి మృతితో వారి రోదనలు మిన్నంటాయి.

గొర్రెల దొంగతనం

చిట్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ పరిధిలో గొర్రెలు చోరీకి గురయ్యాయి. బాధితుడు చిర్రబోయిన శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 4న గొర్రెలను మేతకు తీసుకెళ్లి వచ్చిన అనంతరం వ్యవసాయ బావి వద్ద షెడ్డులో వదిలి ఇంటికి వెళ్లాడు. ఈ నెల 5న ఉదయం వచ్చిచూడగా నాలుగు పెద్దగొర్లు, నాలుగు చిన్నపిల్లలు కనిపించలేదు. ఎవరో చోరీ చేశారని గ్రహించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసినట్లు శ్రీరాములు తెలిపారు. గొర్రెల విలువ రూ.80 వేలు ఉంటుందని తెలిపారు.

కలిసి రాని కాలం

- పడిపోయిన వరి దిగుబడులు
- కోత యంత్రాల కొరతతో అవస్థలు
- ప్రకృతి వైపరీత్యాలతో కునుకు కరవు



అన్నదాతకు పెద్దకష్టం వచ్చింది. ప్రకృతి వైపరీత్యాలతో చేతికొచ్చిన పంట నేలపాలైంది. ఎడతెరిపి లేని వానలు పంటలను జీవచ్ఛవంలా మార్చాయి. వరి పంట నేలవాలిపోవడంతో గింజ చేతికి రాకుండాపోయింది. దిగుబడులు పడిపోయాయి. పంట కోతలకు యంత్రాల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కనీసం పెట్టుబడులు వచ్చే పరిస్థితి కనిపించకపోవడంతో రైతుకు కంటి మీద కునుకు కరువైంది.

– (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ(వ్యవసాయం)

నాగార్జునసాగర్ ఆయకట్టులో పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఈ ఏడాది సుమారు 6.50 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. సకాలంలో పడటంతో సాగర్ ప్రాజెక్టు నుంచి ఆగస్టు మొదటి వారంలో ఎడమకాల్వకు నీరు వదిలారు. ఈ దశలో 80శాతం మంది రైతులు ప్రైవేటు సన్న రకాలు, 20శాతం సాంబమసూరి(బీ.పీ.టీ-5204) వరి రకాలను సాగు చేశారు. సమయానుకూలంగా వర్షాలు కురవడంతో పంట ఏపుగా పెరిగింది. అయితే పంట చేతికొచ్చే దశలోనూ వర్షాలు వదలకపోవడంతో వరి కంకి బరువుకు చాలావరకు పంట నేలవాలింది. గింజ మొలకలు వస్తుండటంతో రైతులకు పాలుపోని దుస్థితి నెలకొంది.

పాలుపోసుకునే దశలో

ఆయకట్టులో సెప్టెంబరులో వరి నాట్లు వేసిన పంట గింజ పాలుపోసుకునే దశలో ఉంది. మరో 20 రోజులైతే పంట చేతి కొచ్చేది. అయితే వర్షాలకు పంట పచ్చగా ఉన్నపుడే పడిపోయింది. లోతట్టు ప్రాంతాల్లో చాప చుట్టినట్లుగా కావడంతో రైతులు పంటపై ఆశ వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. కాండం కుళ్లిపోవడంతో గింజ పాలుపోసుకోకుండానే తాలుగా మారింది. ఈ తరహా పంట ఆయకట్టులో 30శాతం మేర ఉంటుంది. పంట పూర్తిగా తిరగేసినా కూలీల ఖర్చు మినహా ప్రయోజనం ఉండదని, కనీసం 5 బస్తాలు వచ్చే అవకాశం లేదని, మరోసారి వర్షాలు పడితే పొలంలోనే పంట వదిలేయాల్సి ఉంటుందని రైతులు వాపోతున్నారు.

కౌలు రైతులకు కష్టం

ప్రకృతి వైపరీత్యాలతో వరి సాగు చేసిన రైతులకు పెట్టుబడులు చేతికి రాని పరిస్థితుల్లో ఇక కౌలు రైతుల బతుకులు మరింత దయనీయంగా మారాయి. ఆయకట్టులో ప్రాంతాన్ని అనుసరించి వానాకాలం సీజన్‌లో ఎకరానికి 12-15బస్తాల వరకు కౌలు పలుకుతోంది.ఈసారి మాత్రం పంట నష్టం భారీగా ఉండటంతో పెట్టుబడులతో పాటు చేసిన కష్టం పోయిందని కౌలు రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వరికోత యంత్రాలకు భారీగా ఖర్చు

ఆయకట్టులో 100 శాతం వరి పంట సాగైంది. వరి కోతలు ప్రారంభమయ్యే దశలో వర్షాలు పడుతుండటంతో పంట అంతా నేలవాలిపోయింది. గింజ దెబ్బతింటుందనే ఆలోచనతో రైతులు కోతలు త్వరగా పూర్తి చేయడానికి ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వానాకాలం సీజన్‌లో పొలాల్లో బురద ఉంటుంది. టైరు ఉన్న యంత్రాలు కోతకు అనుకూలం కావు, పైగా ఈయంత్రాలు కింద పడిపోయిన పంటను కోయడానికి అనువుగా ఉండవు.కేవలం ట్రాక్‌తో ఉన్న యంత్రాలనే ఉపయోగిస్తారు. దాంతో వాటికి ఒక్కసారిగా డిమాండ్ పెరిగి కొరత ఏర్పడింది.. ఇదే అదనుగా భావించిన ఏజెంట్లు ధరలు ఒక్కసారిగా పెంచేశారు. సాధారణంగా గంటకు రూ.28-3వేలవరకు ధర ఉంటుంది. ప్రస్తుతం రూ.3500లకు పెంచేశారు. అయినా యంత్రాల లభ్యత కష్టంగా మారింది.పంట బాగా ఉన్నపుడు ఎకరం వరి కోతకు గంట నుంచి గంటన్నర సమయం పడుతోంది. ప్రస్తుతం పంట పడిపోయి ఉండటంతో కనీసం 3-4గంటల సమయం పడుతుందని,ఎకరానికి అదనంగా రూ.8-9వేల వరకు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. పంట దిగుబడులు రాకపోగా కోత ఖర్చులు భారీగా పెరగడం రైతులకు భారంగా మారింది.

30 బస్తాలే దిగుబడి

ఆయకట్టులో ముందస్తుగా సాగు చేసిన వరి పంటలు కోతకు సిద్ధంగా ఉన్న దశలో వర్షం పడటంతో రైతులు నైరాశ్యంలో మునిగిపోయారు. ప్రైవేట్ రకాలు (అత్యంత సన్నని)ఎకరానికి 40బస్తాలు పైనే దిగుబడి వస్తుందని అనుకున్నా పంట కిందపడి గింజ తాలుపోవడంతో 20-30 బస్తాలు మించి రావడంలేదని, కోత కోసేటపుడు వరి కర్ర మెత్తబడి ఉండటంతో గింజ గడ్డిలోనే పోతుందని రైతులు చెపుతున్నారు. దాంతో గడ్డి అంతా కుళ్లిపోయి పశువులకు పనికి రాకుండా అయ్యిందంటున్నారు. ఈ రకం వరి కర్ర చాలా బలహీనంగా ఉండటంతో ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకోలేకపోయింది. అధిక వర్షాలకు ఎత్తు పెరగడంతో కోతకు వచ్చిన పంట కింద పడిపోయిందని కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికంగా యూరియా వేసిన పంటలు మినహా సాంబ మసూరి రకం కొంతవరకు కింద పడకుండా ఉందని ఎకరానికి 40-45 బస్తాల వరకు దిగుబడులు వస్తాయని రైతులు చెబుతున్నారు. ఈ పంట రకం సాగు చాలా తక్కువగా చేయడంతో అధికసంఖ్యలో రైతులు ప్రయోజనం పొందలేకపోతున్నారు.

అధిక వర్షాలతో నష్టం

వరి పంట సాగులో పెట్టుబడులు బాగా పెరిగాయి. పంట బాగా వచ్చినా పెరిగిన పెట్టుబడులతో ఏమీమిగలడం లేదు. పైగా ప్రకృతీ వైపరాత్యాలతో అధిక వర్షాలు పడటంతో పంట అంతా నేల పాలైంది. గింజ చాలా వరకు తాలు పోయింది. దిగుబడులు సగం రావడం కష్టం. పెట్టుబడులతో పాటు చేసిన కష్టం నీటిపాలైంది. ఈ సారి పంటల సాగుకు కాలం కలిసి రాలేదు.

– ప్రసాద్, పనసయ్య క్యాంపు, నిడమనూరు

ఆయకట్టుకు కోలుకోని దెబ్బ

వరి పంటల సాగులో రైతులు ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నారు. రసాయన ఎరువులు, పురుగుమందుల ధరలు భారీగా పెరగడంతో ఎకరానికి రూ.30-40వేల పెట్టుబడి వస్తోంది. ఎకరానికి 45-50బస్తాలు దిగుబడులు వస్తేనే కానీ రూ.10 వేలు మించి మిగిలే పరిస్థితి ఉండదు. ఈసారి పంటలు దెబ్బతినడంతో సాగర్ ఆయకట్టు రైతులు నైరాశ్యంలో మునిగిపోయారు. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



జూలూరులో
వాహనం దగ్ధం



జూలూరులో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామానికి చెందిన దుర్గం మౌనికకు చెందిన ద్విచక్రవాహనం మంగళవారం రాత్రి దగ్ధమైంది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపినవివరాల ప్రకారం మౌనిక ఎప్పటిలాగే తన టీజీ307881 ద్విచక్రవాహనాన్ని మంగళవారం రాత్రి తన ఇంటి గేట్ ఎదుట పార్క్ చేసింది. తెల్లవారుజామున 5-30 గంటలకు లేచి చూసే సరికి తన వాహనం పూర్తిగా తగలబడి ఉంది. మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

వేపలసింగారంలో చోరీ

హుజూర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఎస్‌ఐ బండి మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం వేపలసింగారానికి చెందిన రైతు మూడెం గోపిరెడ్డి ఇంటికి తాళం వేసి వ్యక్తిగత పనుల మీద బయటకు వెళ్లాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు గోపిరెడ్డి ఇంట్లోకి చొరబడి రూ.లక్ష నగదు, 8 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. కాగా బయటకు వెళ్లిన గోపిరెడ్డి ఇంటికి వచ్చే సరికి చోరీ జరిగిందని గ్రహించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో ఇటీవల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా అనుమానితుడిని గుర్తించామని, నిందితుడి కోసం వెతుకుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వేపలసింగారంలో ఇటీవల దొంగతనాలు ఎక్కువయ్యాయి.

కుక్కను తప్పించబోయి కారు బోల్తా

- భార్య మృతి, అపస్మారక స్థితిలో కుమారుడు
- స్వల్పగాయాలతో బయటపడ్డ ఇంటి పెద్ద
- కుమారుడు, కుమార్తెకు తీవ్రగాయాలు





రాణి(ఫైల్), ధ్వంసమైన కారు వెనకభాగం

మోతె, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతున్న కుక్కను తప్పించబోయి కారు రోడ్డు కిందకు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో మహిళ మృతి చెందగా ఆమె కుమారుడు అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని మామిళ్లగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి టీఎస్09ఈఎస్ 0537 నెంబరు గల కారులో అన్నెపర్తి సాయిరామ్ తన భార్య రాణి(42), కుమార్తె జాహ్నవి, కుమారుడు లోకేష్‌లతో కలిసి స్వగ్రామమైన తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం పోచవరం ప్రాంతానికి బయలుదేరారు. తండ్రికి అనారోగ్యం చేయడంతో చూసేందుకు హైదరాబాద్ నుంచి బుధవారం తెల్లవారుజామున మూడు గంటలకు బయలుదేరి సూర్యాపేట-ఖమ్మం రహదారిలో వెళ్తున్నారు. మామిళ్లగూడెం వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ మూలమలుపులో అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి కారు రోడ్డు వెంట ఉన్న గుంతలోకి పల్టీ కొట్టింది. ఈ సమయంలో కారులో వెనక సీటులో కూర్చున్న సాయిరామ్ భార్య, ఇద్దరు పిల్లలు రోడ్డు కిందకు పడిపోయారు. గుంత వెంబడి ఉన్న కల్వర్టు భార్య రాణి తలకు బలంగా తగలడంతో తీవ్రగాయమైంది. కుమారుడు లోకేష్, కుమార్తె జాహ్నవికి తీవ్రగాయాలయ్యాయి. డ్రైవింగ్ చేస్తున్న సాయిరామ్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారి సిబ్బంది 1033 వాహనంలో ఖమ్మం తరలిస్తుండగా రాణి మృతి చెందింది. కుమారుడు అపస్మారక స్థితిలో ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. భర్త సాయిరామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.

ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో

చింతపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా సాగర్ మండలం(తిరుమలగిరి) ఎర్ర చెరువు గ్రామానికి చెందిన రమావత్ ఆశోక్ భార్య అంజలి(26) అత్త బిచ్చాలి ముగ్గురు కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి ఆటోలో వస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆటో నడుపుతున్న అశోక్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో ఆటో పల్టీలు కొట్టుకుంటూ కొంతదూరం వెళ్లి పడింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ వెనుకభాగంలో ఆటో బలంగా తగిలింది. దీంతో ఆటోలో ఉన్న అంజలి తలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందింది. అశోక్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతోనే ప్రమాదం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు. అంజలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్



లక్ష్మారెడ్డి(ఫైల్)

నార్కట్‌పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని చికిత్సపొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం దాసరిగూడెం గ్రామానికి చెందిన నంద్యాల లక్ష్మారెడ్డి(50) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని లారీని ఎంజీయూ సమీపంలోని ఓ పెట్రోలు బంకు వద్ద పార్క్ చేశాడు. దగ్గరలోనే గ్రామానికి రోడ్డు పక్కన నడుచుకుంటూ కాలినడకన బయలు దేరాడు. అదే సమయంలో నల్లగొండ వైపు అతివేగంగా వెళ్లిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో లక్ష్మారెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. తొలుత నల్లగొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచన మేరకు హైద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించారు. లక్ష్మారెడ్డి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో నల్లగొండ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.


నీటి గుంతలో పడి వృద్ధుడు మృతి



జాల మల్లయ్య(ఫైల్)

నార్కట్‌పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వర్షాలకు ఖాళీ ప్లాట్లలో నిలిచిన నీళ్లలో ప్రమాదవశాత్తు మునిగి ఓ వృద్ధుడు మృతి చెందాడు. పూర్తిగా కుళ్లిన స్థితిలో మృతదేహం నీటిపై తేలడంతో మృతి వెలుగుచూసింది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలకేంద్రంలో బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి శాపల్లి గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాలిలా ఉన్నాయి. శాపల్లి గ్రామానికి చెందిన జాల మల్లయ్య(60) గొర్లకాపరిగా పనిచేస్తున్నాడు. కాగా నార్కట్‌పల్లిలోని రహదారి బంగ్లా ఎదురుగా ఉన్న పీఆర్‌టీయూ భవన్ వెనకాలే ఓ చిన్న గది నిర్మించుకుని నివసిస్తున్నారు. అయితే మల్లయ్యకు ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో శాపల్లిలోని సొంత స్థలంలో ఇంటినిర్మాణం చేపట్టాడు. ఈనెల 3న నార్కట్‌పల్లిలోని శబరి గార్డెన్‌లో తన సమీప బంధువుకు చెందిన ఓ శుభకార్యంలో పాల్గొన్నాడు. అప్పటి నుంచి నార్కట్‌పల్లిలో ఉన్న నివాసానికి కాని, శాపల్లిలో ఉన్న ఇంటికి వెళ్లలేదు. శాపల్లికి వెళ్లాడమో అని భార్య రాములమ్మ అనుకుంది. కాగా బుధవారం ఉదయం కొందరు యువకులు నీటి గుంటపై తేలియాడుతున్న కుళ్లిపోయిన స్థితిలో దుర్వాసన వస్తున్న మృతదేహాన్ని చూసి పోలీసులకు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో వచ్చి నీటిగుంతపై తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీసి ఆరా తీయగా మృతుడు జాల మల్లయ్యగా గుర్తించారు. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మల్లయ్యకు, భార్యతో పాటు కుమారుడు ఉన్నాడు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



కృష్ణ(ఫైల్)

హుజూర్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. పట్టణంలోని పాతయాదవ్‌బజార్ సెంటర్‌లో నివాసముంటున్న రసమళ్ల కృష్ణ(41) వాటర్‌ప్లాంట్‌లో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కృష్ణ పీర్లచావిడి సెంటర్‌లో వాటర్ పంపిణీ చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అయనకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు మోక్షిత, లోహిత్ ఉన్నారు. కృష్ణ మృతి బాధాకరమని పలువురు పార్టీ నాయకులు అన్నారు. ఆయన మృతదేహానికి పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పెన్‌పహాడ్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరికోత యంత్రం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన సంఘటన సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం చీదెళ్ల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చీదేళ్ల గ్రామానికి చెందిన మర్రిపెల్లి సైదులు ఇటీవల వరి కోత యంత్రాన్ని కొనుగోలు చేశాడు. గ్రామానికి చెందిన రైతు మోదుగు వెంకట్‌రెడ్డి పొలాన్ని రాత్రి సమయంలో కోస్తుండగా పొలం పక్కన ఉన్న వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు వరికోత యంత్రం పడిపోయింది. ఈ క్రమంలో డ్రైవర్ మర్రిపెల్లి సంతోష్ అప్రమత్తమై యంత్రం నుంచి బయటకు దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. బావిలో పడిపోయిన యంత్రాన్ని బుధవారం క్రేన్ల సహాయంతో స్థానికులు బయటకు తీశారు.



'బెల్ట్ దుకాణాలను ప్రోత్సహించవద్దు'

మునుగోడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బెల్ట్ దుకాణాలను ప్రోత్సహించవద్దని, నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మద్యం దుకాణాలు దక్కించుకున్న వారికి సూచించారు. టెండర్లు దక్కించుకున్న వారు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో బెల్ట్ దుకాణాలను అరికట్టేందుకు తాను ప్రయత్నిస్తున్నానని, ప్రజల ఆరోగ్య పరిరక్షణే తనకు ముఖ్యమన్నారు. మద్యం దుకాణాలను దక్కించుకున్న వారు నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. బెల్ట్ షాపులు పూర్తిగా నిషేధించామని, ఏ ఒక్కరూ బెల్ట్ దుకాణాలు నిర్వహించినా, వారికి మద్యం విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరికలు చేశారు.

వరుసకు చెల్లిపై లైంగిక వేధింపులు

యువకుడిపై పోక్సో కేసు నమోదు, రిమాండ్

మోత్కూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరుసకు చెల్లెలు అయ్యే బాలికపై ఓ యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. మోత్కూరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మోత్కూరులో చికెన్ దుకాణంలో పనిచేస్తున్న మహేందర్ వరుసకు చెల్లెలు అయిన బాలికను కొద్ది రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. అతడి వేధింపులు భరించలేక బాలిక విషయాన్ని తన తల్లికి చెప్పడంతో ఆమె మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఆమె ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. యువకుడిని అరెస్టు చేసి చౌటుప్పల్ కోర్టులో హాజరు పర్చి, నల్లగొండ జైలుకు తరలించామన్నారు.

ఆలయాలకు కార్తీక దీప వెలుగులు


కొండమల్లేపల్లిలో దీపారాధన చేస్తున్న మహిళలు


సంగెం మూసీ కాల్వ వద్ద శివలింగానికి పూజలు


మట్టపల్లి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


నల్లగొండలోని ఛాయాసోమేశ్వరాలయం వద్ద బారులు తీరిన భక్తులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు మిన్నంటాయి. ఆలయాలకు తెల్లవారు జాము నుంచే భక్తులు పోటెత్తారు. దీంతో సందడి నెలకొంది. ఒత్తులు వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


నల్లగొండలోని సోమేశ్వరాలయంలో దీపారాధన


వాడపల్లిలో దీపారాధన చేస్తున్న మహిళలు


నల్లగొండలోని సంతోషిమాతా ఆలయంలో వ్రతపూజలు


మేళ్లచెర్వులో శివలింగానికి ప్రత్యేక పూజలు


నల్లగొండలోని సోమేశ్వరాలయంలో శివలింగానికి పూజలు

నేటి నుంచి సాగర్‌లో బీసీ గురుకులాల క్రీడలు

నాగార్జునసాగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో గల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో గురువారం నుంచి బీసీ గురుకుల పాఠశాలల, కళాశాలల జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే పోటీల్లో అండర్-14,17,19 విభాగలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు అండర్ -14 విభాగాలకు, 8 నుంచి 13వ తేదీ వరకు అండర్-17,19 విభాగాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో 16 పాఠశాలలు, కళాశాలలు చెందిన 1000 మంది క్రీడాకారులు పాల్గొననున్నట్లు వివరించారు.

రాజాపేటలో గురుకుల పాఠశాల జోనల్ స్థాయి క్రీడలు

రాజాపేట : గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 11వ జోనల్ స్థాయి (బాలుర) క్రీడలను యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేటలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం నుంచి నిర్వహించ నున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో ఐదోవ జోన్ పరిధిలోని 13 విద్యాసంస్థల నుంచి 1,105 మంది క్రీడాకారులు పాల్గొనున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, ఖోఖో, క్యారమ్స్, చెస్ నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యార్థులకు వసతితో పాటు ఆటస్థలం సిద్ధం చేశారు.

హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు గుట్ట విద్యార్థినులు


సాయిచరిత, రవళి

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట ప్రభుత్వ ఉన్నత బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు సాయిచరిత, రవళి రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నల్లగొండ జిల్లా కటంగూరు మండలం అన్నారం జడ్పీ ఉన్నత పాఠశాల నిర్వహించిన అంతర్‌జిల్లా అండర్-14 హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో వీరిని ఎంపిక చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారద తెలిపారు. విద్యార్థినులు నారాయణపేట్ జిల్లా కోస్గిలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు బీబీనగర్ క్రీడాకారులు

బీబీనగర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలానికి చెందిన ఏడుగురు జూడో క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జూడో కోచ్ షేక్ పర్వేజ్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాజధాని భూపాల్‌లో ఉన్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ జూడో టోర్నమెంట్‌కు తెలంగాణలోని వివిధ యూనివర్సిటీల తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఓయూ తరఫున ఆకాశ్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆలిండియా యూనివర్సిటీకి సాయి కిరణ్ నాయక్, ఎంపీ యూనివర్సిటీకి హర్షిత్ యాదవ్, జేఎన్‌టీయూ తరఫున రుతిక్ సాగర్, సుమంత్ కుమార్, అబ్దుల్ కరీం ఆడనున్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జూడో క్రీడాకారులు జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా యువజన అధికారి ధనుంజయ్‌లు, జూడో సంఘం జిల్లా అధ్యక్షులు దేవులపల్లి బ్రహ్మం, ఉపాధ్యక్షుడు ఆకుల సాయి అభినందించారు.

యువ గొంతుక వినిపించేలా

- యూత్ పార్లమెంట్-2026 కార్యక్రమం
- రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఈ నెల 10
- నోడల్ కళాశాలగా ఎన్జీకళాశాల



ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ర్యాంకులు తప్ప రాజకీయాలపై కనీస అవగాహన లేకుండాపోతోంది. రాజకీయ నేపథ్యమో, కుటుంబ వారసత్వం, అమాత్యుల అనుచరణ గణమైతేనో తప్ప రాజకీయ రంగంలోకి రావడం లేదు. ఈ నేపథ్యంలో దేశజనాభాలో సగభాగమున్న యువతను అభివృద్ధిలో భాగసామ్యం చేయడంతో పాటు సుపరిపాలన అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు వారి నుంచి స్వీకరించాలన్న తలంపుతో కేంద్ర యువజన, క్రీడల శాఖ యూత్ పార్లమెంట్ అనే వేదికను ఏర్పాటు చేసింది.

- (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

స్వయంస్వాలంబన దిశగా అడుగులేస్తున్న దేశం అంచెలంచెలుగా ఎదిగేందుకు నిర్మాణాత్మకమైన నిర్ణయాలు ఎంతో అవసరం. అందుకు యువత సలహాలు, సూచనలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది.2019లో ప్రారంభించిన ఈ కార్యక్రమం ఇంతింతై వటుడింతై అన్నట్లుగా విస్తరిస్తోంది.వికసిత భారత్-యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో భాగంగా 18నుంచి 25ఏళ్ల లోపు విద్యార్థులు యూత్ పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది. అయితే వికసిత్ భారత్ పోటీలో పాల్గొనే విద్యార్థులు ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్నట్లు గుర్తింపు ఉన్న ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

నూరేళ్ల స్వాతంత్ర్య భారత్ కోసం..

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047 నాటికి నూరేళ్లు నిండుతున్నాయి. అప్పటికీ దేశం అన్ని రంగాల్లో ముందుండాలంటే ఎలాంటి పాలన అవసరం, ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించాలనే అంశాలపై యువత తమ అభిప్రాయాలను పంపాల్సి ఉంటోంది. వాటితో పాటు నిర్దేశించిన అంశంపై తాము రూపొందించిన వీడియో సందేశాన్ని 'మై భారత్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. జాతీయ స్థాయి పోటీ కావడంతో యువత తమకు వచ్చిన, నచ్చిన భాషలో సందేశ వీడియోను పంపించవచ్చు.

నోడల్ కేంద్రంగా నాగార్జున ప్రభుత్వ కళాశాల

వికసిత భారత్ - యూత్ పార్లమెంట్ పోటీలను నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా జిల్లాకో నోడల్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. అందులో భాగంగా ఎంజీయూ పరిధిలోని విద్యార్థులు తమ అభిప్రాయాలు, సూచనలు పంపేందుకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మరోసారి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది నల్లగొండ, యాదాద్రిభువనగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాలను కలిపి ఈ కళాశాలను నోడల్ కేంద్రంగా ఏర్పాటు చేయగా, ఈ ఏడాది జిల్లాకో కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, మెడికల్, పీజీ కళాశాలలో అభ్యసిస్తున్న విద్యార్థులు పోటీలలో పాల్గొనొచ్చు.

రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఈ నెల 10

యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మైభారత్ పోర్టల్‌లో పూర్తి వివరాలను నమోదు చేయాలి. తాను విద్యార్థిని అన్న గుర్తింపు ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని వికసిత భారత్ కార్యక్రమ చైర్మన్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



వికసిత భారత్ - యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. దేశాభివృద్ధిలో విద్యార్థుల సృజనాత్మక, సందేశాత్మక వీడియో రూపొందించి అసెంబ్లీ, పార్లమెంట్‌లో మాట్లాడే అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి. అందుకు ఈ నెల 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. సందేహాల నివృత్తి కోసం కళాశాలలో, మేరా యువ భారత్ యూత్ ఆఫీసర్‌ను సంప్రదించవచ్చు.

- డాక్టర్ సముద్రాల ఉపేందర్, వికసిత్ భారత్ ప్రోగ్రాం చైర్మన్

జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుంది



విద్యార్థులు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకునేందుకు లభించిన చక్కటి అవకాశమే యూత్ పార్లమెంట్ కార్యక్రమం. ఈ పోటీల్లో అంద రూ పాల్గొనేలా చేయాలి. పోటీలు నైపుణ్యాలను వెలికి తీయడంతో పాటు రాజకీయా లు, పరిపాలనపై అవగాహన పెరుగుతోంది. చక్కటి సందేశాన్నిచ్చే వీడియోలు రూపొందించి ఎంజీయూకు ఢిల్లీస్థాయిలో గుర్తింపు తేవాలి.

- డాక్టర్ పీ మద్దిలేటి(ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, ఎంజీయూ)

ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ-లెసన్స్ ఫర్ ఇండియన్ డెమొక్రసీపై..

గత ఏడాది ఒకే దేశం-ఒకే ఎన్నిక అంశంపై యూత్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాదికి "యాభై సంవత్సరాలకు ముందుగా అత్యవసర పరిస్థితి - భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు" (50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ-లెసన్స్ ఫర్ ఇండియన్ డెమొక్రసీ) అనే అంశంపై పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో పాల్గొనేందుకు విద్యార్థులు 3 నిమిషాల ప్రసంగం ఇవ్వాలి. వీడియో రూపంలో సందేశాలను పంపించాలి. వాటిలో ఉత్తమమైన 10 వీడియోలను ఎంపిక చేసి తొలుత రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తారు. అక్కడ నుంచి జాతీయస్థాయికి ఎంపిక ఉంటుంది.

యాదగిరి కొండపై భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి కొండపై బుధవారం భక్తులతో కార్తీక సందడి నెలకొంది. కార్తీకమాసంలో పౌర్ణమి కావడంతో సత్యదేవుని వ్రతాలు, ప్రధానాలయంలో అన్నకూటోత్సవం, ఆకాశ దీపారాధన వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో కొండకింద వ్రత మండపాలు నిండిపోయాయి. వ్రత టికెట్లు పొందేందుకు భక్తులు బారులు తీరారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి ప్రతి రోజు ఆరు విడతలు ప్రత్యేక పౌర్ణమి రోజు 8 విడతలు అధికారులు సత్యదేవుని వ్రతాలు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ భక్తుల తాకిడి పెరుగడంతో 10 విడతల్లో 1,956 జంటలు సత్యదేవుడి వ్రతాలు జరిపించి మొక్కులు తీర్చుకున్నారు.వ్రత మండపాలు, పరిసర ప్రాంతాలను ఇన్‌చార్జీ ఆలయ ఈవో గుగులోతు రవినాయక్ పరిశీలించి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బందికి సూచించారు. కొండపైన ఆలయం ఉత్తర తిరువీధి, శివాలయం, కొండకింద లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపం, వైకుంఠద్వారం వద్ద మొత్తం తాత్కాలిక మండపాల్లో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. దేవస్థానం నుంచి వ్రత టికెట్లు, ఎమగ్రి తీసుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు. సుమారు 48 వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా ఉభయ దర్శన క్యూలైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.50,02,889 ఆదాయం సమకూరినట్లుఈవో తెలిపారు.

స్వామి సన్నిధిలో విశేష పర్వాలు

దివ్యక్షేత్రంలో పవిత్ర కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా బుధవారం అన్నకూటోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా పులిహోర, కదబంతో కూడిన నైవేద్యాన్ని స్వామికి అన్నకూటోత్సవం చేపట్టి స్వామివారి నిత్య కల్యాణం తర్వాత మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు గోష్ఠిలో భాగంగా ప్రసాద వితరణ చేయగా కలెక్టర్ ఎం. హనుమంతరావు దంపతులు పాల్గొన్నారు. ఆలయ ముఖ మండపంలో ధ్వజ స్థంభం వద్ద ఆలయ పూజారులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఇన్‌చార్జీ ఈవో జి. రవి, అనువంశిక ధర్మకర్త కుటుంబసభ్యులు ఆకాశ దీపారాధన చేశారు. వేడుకల్లో ఇన్‌చార్జీ ఈవో జి. రవి అను వంశిక ధర్మకర్త కుటుంబసభ్యులు, ఇన్‌చార్జీ డీఈవో జూశెట్టి క్రిష్ణ, ఏఈవోలు సిబ్బంది పాల్గొన్నారు. కాగా స్వామివారికి రూ. 11.50లక్షల ఖరీదు గల జాన్ డీయర్ 5042డీ ట్రాక్టర్‌ను తెలంగాణ డీలర్ల సంఘం తరఫున బహూకరించారు.


గర్భాలయంలో ఉభయ క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

శాస్త్రోక్తంగా నిత్యపూజలు

స్వామి ఆలయంలో నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీ దళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు చేపట్టారు. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు.


నిత్య కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు


ఆకాశ దీపారాధనలో ఇన్‌చార్జీ ఈవో రవి, ధర్మకర్త కుటుంబసభ్యులు

ముగిసిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు


విజేతలతో నిర్వాహకులు

నల్లగొండ స్పోర్ట్స్, నవంబరు5(ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) నల్లగొండ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి పోలీస్ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 69వ రాష్ట్ర స్థాయి తైక్వాండో అండర్- 17 బాల,బాలికల పోటీలు బుధవారం ముగిశాయి. డీఎస్పీ అక్బర్ అలీ, టూటౌన్ ఎస్ఐ వై. సైదులు, కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ఎంపీ గోనారెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల ముఖ్యఅతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. పోటీలకు వివిధ జిల్లాల నుంచి నుంచి బాల, బాలికలు హాజరై క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారు. విజేలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ పరిశీలకులు ఎం. ఈశ్వర్, దితైక్వాండో అసోసియేషన్ ఆఫ్ నల్లగొండ జిల్లా ప్రధాక కార్యదర్శి యూనుస్ కమాల్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కుంభం నర్సిరెడ్డి, శంభులింగం, నాగరాజు, రవీందర్, యుగేందర్, అంబటి ప్రణీత్, కోచ్‌లు పాల్గొన్నారు.

CLASSIFIEDS

SSC మెమో పోయినది

★ గుగులోతు గణేష్ తండ్రి మోహన్‌రావ్, నివాసం: యతిరాజపురం తండ, మం॥ మేళ్ళచెరువు, జిల్లా సూర్యాపేట. మేళ్ళచెరువు నుండి యతిరాజపురం గ్రామమునకు వస్తుండగా నాయొక్క SSC Memo, H.T.No. 2430103132 గలది పోయినది దొరికిన వారు సంప్ర॥ సెల్ : 9640856249.

AJY_248172

LOST OF PASSPORT

★ కర్నాటి మేల్లేశం తండ్రి రాములు, ఇంటి నెం. 1-6-141/43/15/2/4, శ్రీరాంనగర్, సూర్యాపేట అను నేను సూర్యాపేట మెడికల్ కాలేజ్ నుండి పాత బస్టాండ్‌కు తేది 15.10.2025 నాడు బైక్‌పై వెళ్తుండగా నా పాస్‌పోర్టు నెం. E0351829 పోయింది. దొరికిన వారు సంప్ర॥ సెల్ : 7396393666.

AJY_6834

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

4 Lines CLASSIFIED
NLG+SRPT+YGT (3Dist)
210/-Only
Extra Line 45/- Only
For Ads Contact :
NALGONDA DIST 9985413656 9985413365
SURYAPET DIST 9703618713, 9985401015
YADADRI BHONGIRI DIST 8885995946

మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం


పుష్కరిణిలో చక్రతీర్థం నిర్వహిస్తున్న అర్చకులు

వలిగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. చివరి రోజు బుధ వారం నేత్రానందంగా చక్రతీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. దివ్యమనోహరంగా అలంకరించి ఉగ్రనరసింహుడు ఆయుధం శ్రీ సుదర్శన చక్రం ప్రత్యేక పల్లకీ సేవలో తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. మండపంలో శాస్త్రోక్త పూజలు నిర్వహించి మంగళవాయిద్యాల మధ్య స్వామికి స్నానఘట్టాలు జరిపారు. ఈ తంతు ప్రధాన అర్చకులు శ్రీ ప్రతాపురం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో జరిగింది. అలాగే లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవం మంగళప్రదం, విశ్వ శాంతి, లోక కల్యాణార్థం పరమాత్ముడిని ప్రార్థిస్తూ భక్తజన కోటిని రక్షించమని ఆ స్వామిని వేడుకొన్న తదుపరి యాగ పరిసమాప్తి కోసం యజ్ఞీకులు మహా పూర్ణాహుతి నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను తిలకించడానికి రుత్వీకులు 33వేల కోట్ల దేవతలను ఆహ్వానించి ముగింపు నేపథ్యంలో వారి స్వస్థలాకు భక్తి పూర్వకంగా చేర్చే ప్రక్రియ దేవతోద్వాసనం. తంతును శాస్త్రోక్తంగా జరిపారు. ఈ కార్యక్రమంలో స్వామి వారిని చౌటుప్పల్ ఆర్డీవో కృష్ణారెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు.

నేడు నెల్లిబండలో ఉచిత కంటి వైద్య శిబిరం

నకిరేకల్, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): నకిరేకల్ మండలంలోని నెల్లిబండ గ్రామంలో గురువారం నకిరేకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నకిరేకల్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి యానాల శంకర్‌రెడ్డి తెలిపారు. నెల్లిబండతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఉచిత కంటివైద్య శిబిరం, షుగర్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పత్తి కొనుగోళ్లలో రైతులకు అన్యాయం : టీడీపీ

మర్రిగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో ప్రభుత్వం రైతులను అన్యాయం చేస్తోందని టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి దోమల వెంకన్న అన్నారు. మండలకేంద్రంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీసీఐ కేంద్రంలో గతంలో రైతు నుంచి 12 క్వింటాళ్ల పత్తి తీసుకునే వారని, ప్రస్తుతం ఏడు క్వింటాళ్ల వరకు మాత్రమే తీసుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో ఉప్పల యాదయ్య, నరసింహ, వెంకటయ్య, శ్రీను, వెంకట్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

'నిత్యపుస్తక కానుక' ప్రారంభం



ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా పుస్తకాలు అందజేస్తున్న ప్రతినిధులు

నల్లగొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువత కోసం నిత్యపుస్తక కానుక ఉద్యమాన్ని చేపట్టిందని ఫౌండేషన్ సీఈవో ఎంవీ గోనారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతరం మొబైల్ ఫోన్లకు పరిమితమవుతున్న తరుణంలో ఫౌండేషన్ పుస్తక పఠన ఉద్యమాన్ని చేపటిందన్నారు. విద్యార్థులకు ముఖ్యమైన, విలువైన పుస్తకాలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. విశ్లేషణాత్మక ఆలోచన, భాషా నైపుణ్యాలు, జ్ఞానాన్ని అందించడానికి పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు.

రజకవృత్తిదారుల సంఘం మండల కమిటీ ఎన్నిక



పెద్దులు, యాదయ్య

చిట్యాల, నవంబరు5, (ఆంధ్రజ్యోతి): రజక వృత్తిదారుల సంఘం చిట్యాల మండల కార్యవర్గాన్ని ఈనెల 4వ తేదీన జరిగిన సంఘం మండల మహా సభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రారపు పెద్దులు, ప్రధాన కార్యదర్శిగా ఐతరాజు యాదయ్య, గౌరవ సలహాదారులుగా ఎద్దులపురి కృష్ణ, ఆనగంటి ముత్యాలు, గౌరవాధ్యక్షుడిగా దామనూరి కనకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఐతరాజు నర్సింహ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోలి మహేష్ ఎన్నికయ్యారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ నారాయణ

మునుగోడు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ అన్నారు. మండలంలోని బీరెల్లిగూడెం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బాస్కర్, మార్కెటింగ్ డైరెక్టర్ చిన్నారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. నరసింహ, యాదయ్య, ఎస్ఆర్పీ దీపిక, మహిళా సంఘం అధ్యక్షురాలు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

శాలిగౌరారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధే ధ్యేయంగా చైత్ర ఫౌండేషన్ పనిచేస్తుందని చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ అన్నారు. మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలోరూ.1.50లక్షలతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్యూరీఫైడ్ వాటర్ ప్లాంట్‌ను గ్రామపంచాయతీ కార్యదర్శి రాజేందర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లి సైదులు, వివిధ పార్టీల నాయకులు అక్కినపల్లి శ్రీనివాస్, రాములు, కాంచాని నాగరాజు, శేషరాజుపల్లి రామచంద్రు, చివుట సైదులు, రేపాని రాజు, దండంపెల్లి శ్రీనివాస్, శీలం యాదగిరి, నారగోని వీరయ్య, ఇంద్రకంటి శ్రీనివాస్, శీలం వీరయ్య, నూర దుర్గయ్య పాల్గొన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి



గురుద్వారలో పూజలు చేస్తున్న భక్తులు

చిట్యాల, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): చిట్యాల గురుద్వారాలో బుధవారం శిక్కు మత వ్యవస్థాపక గురువు శ్రీగురునానక్ దేవ్‌జీ జయంతిని ఘనంగా నిర్వహించారు. గురుద్వారాలో సామూహిక ప్రార్థనలు చేశారు. శబద్‌బాణీ కీర్తనలు, భజనలు గావించారు. చిట్యాల పరిసర ప్రాంతాల సిక్కు కులస్థులు వచ్చి ప్రార్థనలు చేశారు. అనంతరం గురుకా లంగర్ (సహపంక్తి భోజనాలు) చేశారు. కార్యక్రమంలో గురు ధర్మప్రచార పీఠం వ్యవస్థాపకుడు బహాదూర్ సింగ్, ప్రేమ్‌సింగ్, అంగద్‌సింగ్, పరమేశ్వర్‌సింగ్, జీవన్‌సింగ్ పాల్గొన్నారు.

బీసీల మౌన దీక్షను విజయవంతం చేయాలి

నల్లగొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం, రాష్ట్ర జాక్ పిలుపు మేరకు ఈ నెల 6వ తేదీన ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్లల్లో నిర్వహించే మౌన దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నేల పట్ల సత్య నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీక్షను జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర బీసీ జాక్ వర్కింగ్ ప్రెసిడెంట్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభిస్తారని తెలిపారు.

యాదవుల సంస్కృతి చాటిన సదర్ ఉత్సవం

నల్లగొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సదర్‌ఉత్సవం సమాజానికి యాదవుల సాంస్కృతిని చాటిందని సదర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు మద్ది శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని యాదవ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండలో సదర్ సమ్మేళనాన్ని వైభవంగా నిర్వహించామని, పెద్ద సంఖ్యలో యాదవ్ కుటుంబసభ్యులతో పాటు ఇతర కులాలవారు, హాజరై విజయవంతం చేశారని తెలిపారు. సమావేశంలో సంఘం నాయకులు మల్లయ్య, సైదులు, నాగరాజు, చంద్రయ్య, పవన్, లింగయ్య, రాంబాబు, వెంకన్న, నర్సింహ్మ, వరప్రసాద్ పాల్గొన్నారు.



కార్తీక శోభ



చండూరులో..

కేతేపల్లి శివాలయంలో కార్తీక దీపాల తో ఓంకారం

దేవాలయాలు వెలుగులతో కొత్త శోభ సంతరించుకున్నాయి. బుధవారం తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి దీపాలు వెలిగించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో సందడి నెలకొంది.



నార్కట్‌పల్లిలో హోమం నిర్వహిస్తున్న అర్చక స్వాములు



శాలిగౌరారంలోని శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



నల్లగొండలో...



నల్లగొండలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ బదిలీ

● మహిళలను ఇబ్బందులు పెట్టారని ఆరోపణలు ● ఈవెంట్‌లలో ఇష్టానుసారంగా వ్యవహరించాడని నిర్ధారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లగొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ఒక ప్రధాన బ్యాంక్‌కు అనుబంధంగా కొనసాగుతున్న ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలను లైంగికంగా వేధించాడన్నా ఆరోపణలతో పాటు శిక్షణ పూర్తి అయిన అనంతరం వీడ్కోలు కార్యక్రమంలో ఆ సార్ వ్యవహార శైలి నిర్ధారణ కావడంతో ఎట్టకేలకు బదిలీ వేటువేశారు. బావలు సయ్యా.. మరదలు సయ్యా.. అనే శీర్షికన సెప్టెంబరు 11వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆ కథనం వచ్చినప్పటి నుంచి సదరు బ్యాంకు ఉన్నతాధికారులు శిక్షణ సంస్థలోని డైరెక్టర్‌పై విచారణ జరిపారు. ఎట్టకేలకు అతనిపై చర్యలు తీసుకున్నారు. శిక్షణ పూర్తిఅయిన తర్వాత మహిళలకు ఇష్టం లేనప్పటికీ వారిని బెదిరించే ధోరణిలో వ్యహరించి ఈవెంట్‌లో పాల్గొని బావలు సయ్యా... మరదలు సయ్యా... సైసై రింబోలా.. రింబోలా పాటకు డ్యాన్స్ చేయకపోతే సర్టిఫికెట్లు ఇవ్వబోమని, రుణాలు కూడా రావని చెప్పడంతో సదరు అమాయక మహిళలు ఈవెంట్‌లో పాల్గొనేవారు. ఈ ఈవెంట్‌కు సంబంధించిన రింబోలా డ్యాన్స్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. దీనికి తోడు ట్రైనింగ్ సెంటర్‌లో పనిచేసే మహిళా ఉద్యోగితో పాటు శిక్షణకు వచ్చిన మహిళలు కూడా వేధించడంతో అందులో ఓ మహిళ ఉద్యోగి షీటీమ్‌కు కూడా ఫిర్యాదు చేసింది. సంబంధిత బ్యాంకు ఉద్యోగులు ఆమెకు నచ్చజెప్పడంతో పాటు సదరు డైరెక్టర్‌పై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అప్పట్లో శిక్షణ సంస్థలో పనిచేసే మహిళ ఉద్యోగి కేసును ఉప సంహరించుకున్నారు. ఆ డైరెక్టర్‌ను చితకబాదినట్లుగా అప్ప ట్లో చర్చ జోరుగా సాగింది. మొత్తానికి సదరు డైరెక్టర్‌పై బదిలీ వేటు వేసి బ్యాంకులో గతంలో పనిచేసిన స్థానానికి పరిమితం చేసిన ట్లు తెలిసింది. దీంతో పాటు ఆ డైరెక్టర్ స్థానంలో మహిళ అధికారి బాధ్యతలు ఇవ్వడంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

పత్తి కొనుగోళ్లు షురూ

(5వ పేజీ తరువాయి)

అయోమయానికి గురవుతున్నారు. సీసీఐ నిబంధనలు జిన్నింగ్ మిల్లుల వ్యవస్థనే సవాలు చేసే విధంగా మారడంతోపాటు చివరికి జిన్నింగ్ పరిశ్రమ మూతపడే ప్రమాదం ఉందన్న వాదన వినిపిస్తుంది. మిల్లుల ఉనికిని సవాల్‌చేసే విధంగా సీసీఐ వ్యవహరిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. ఎల్-1, ఎల్-2, ఎల్-3 వాదనతో జిన్నింగ్ మిల్లుల వ్యవస్థకు విఘాతంగా మారిందన్న చర్చ సాగుతుంది.

వానాకాలంలో తీవ్ర నష్టం

జిల్లాలో ఈ వానాకాలంలో పత్తి రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ప్రతీ ఎకరాకు ఒక్కో రైతు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. వచ్చిన పత్తి దిగుబడులను చూస్తే పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో? లేదో? అన్న సందేహాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతోపాటు మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో 25,919 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా దేవరకొండ నియోజకవర్గంలో 18,830 ఎకరాల్లో పత్తి దెబ్బతినగా, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 2,814ఎకరాలు, మిర్యాలగూడ నియోజకర్గంలో 65ఎకరాలు, మునుగోడు నియోజకవర్గంలో 1,350ఎకరాలు, నకిరేకల్ నియోజకవర్గంలో 2,721 ఎకరాలు, నల్లగొండ నియోజకవర్గంలో 139ఎకరాల పంట దెబ్బతింది.

తేమశాతంతో కొనుగోళ్లపై ప్రభావం

గత నెల 24వ తేదీన తొమ్మిది జిన్నింగ్ మిల్లులలో కొనుగోళ్ల ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 23ఉండగా, కేటగిరీల ప్రకారం ప్రస్తుతం కొనుగోలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 6,476 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. తరచుగా వర్షాలు వస్తుండటంతో పత్తి తడిసిపోయి తేమశాతం పెరిగి విక్రయించే వీలు లేకుండాపోతుంది. పత్తిలో తేమశాతం 8నుంచి 12శాతం కంటే ఎక్కువగా ఉంటే కొనుగోలు చేసే పరిస్థితి లేదని సీసీఐ స్పష్టం చేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తేమశాతం 25వరకు ఉన్నా కూడా కొనుగోలు చేస్తే రైతులు గట్టెక్కే పరిస్థితి ఉంది. కానీ తేమశాతం కొనుగోళ్లపై ప్రభావం చూపిస్తుంది. అదే విధంగా సీసీఐ కొత్తగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ తప్పనిసరి చేసింది. అయితే రైతుల వద్ద చాలా మందికి స్మార్ట్‌ఫోన్ లేకపోవడం, ఉన్న వారికి అవగాహన లేకపోవడంతో ఆ యాప్‌లో నమోదు చేయలేక పోతున్నారు.నాణ్యమైన పత్తికి క్వింటాకు రూ.8,110 చెల్లిస్తామని చెప్పినా, ప్రస్తుతం అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి

ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. అప్పు తెచ్చి మరీ రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం పత్తి ఏరడానికి కూలీలు దొరకడం లేదు. కూలీలకు కిలో రూ.20 ఇస్తామన్నా ఎవరూ రావడం లేదు. వర్షాల కారణంగా పంటకు తెగులు సోకి నల్లగా మారింది.

● గుండాల మల్లయ్య, పెండ్లిపాకల

చెర్వుగట్టులో ఘనంగా జ్వాలా తోరణం

నార్కట్‌పల్లి, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వేడుకలు నార్కట్‌పల్లి మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మండలంలోని చెర్వుగట్టు, గోపలా యపల్లి లాంటి ప్రధాన దేవస్థానాలతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న అన్ని శివాలయాల్లో పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలను ఘనంగా నిర్వహించారు. తల స్నానమాచరించి నిష్ఠాశ్రద్ధాసక్తులతో భక్తులు ముఖ్యంగా మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. సాయంత్రం వేళ జ్వాలా తోరణాలు వెలిగించే వేడుక భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. చెర్వుగట్టు క్షేత్రానికి సుప్రభాత సేవ నుంచే భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లలో వేచి ఉన్నారు. సామూహిక సత్యదేవుని వ్రతాలను ఆచరించారు. గోపలాయపల్లిలోనూ పార్వతీ రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. చెర్వుగట్టు దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై జోగిని శ్రాంతి విమర్శలు చేశారు. సరైన వసతులు



జ్వాలా తోరణం వెలిగిస్తున్న ప్రధాన అర్చకుడు రామలింగేశ్వరశర్మ

కల్పించడంలో దేవస్థానం అధికారులు విఫలమవుతు న్నారని విమర్శించింది. తాము ఎన్నోయేళ్లుగా దేవస్థానానికి వస్తున్నా మని వసతులు మాత్రం మృగ్యమవుతున్నాయని ఆరోపించింది.

రైతులు కదిలారు.. కాల్వ బాగుచేసుకున్నారు



కాల్వకు అడ్డుగా ఉన్న రాళ్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

మునుగోడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలవారిగూడెం కుంట వద్ద కాల్వ పూడుకపోయి వరదనీరు కల్లెడ దగ్గర కాల్వకు సరిగా రావడం లేదు. రైతులు సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులకు ఇటీవల సమాచారం ఇచ్చారు. బుధవారం మునుగోడు మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, రైతులతో కలిసి సింగారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉప్పునూతల రమేష్, ఉప్పునూతల ఉపేందర్, కట్ట సుదీర్‌రెడ్డి, ఉప్పునూతల వెంకన్న, నకిరేకంటి చినమసిలి జక్కలవారిగూడెం కుంట వద్దకు వెళ్లి కాల్వను పరిశీలించారు. నీరు మునుగోడు వాగువైపు వృథాగా వెళ్లకుండా ఎక్స్‌కవేటర్‌తో కాల్వ శుభ్రం చేయించారు. దీంతో వరదనీరు పెద్ద మొత్తంలో మునుగోడు చెరువులోకి వస్తోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. జక్కలవారిగూడెం నుంచి కల్లెడ కాల్వకు వరద నీరు వచ్చే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తామని కృషిచేస్తామని సింగారం మాజీ సర్పంచ్‌లు సోమగానికి సంతోష్, పోగుల జానకిప్రకాశ్, ఉప్పునూతల రమేష్, జిల్లా లక్ష్మమ్మవెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత

శాలిగౌరారం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన గద్దపాటి రోహిత్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షులు కందాల సమరంరెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. బుధవారం ఆకారం గ్రామంలో బాధితురాలు తండ్రి గద్దపాటి అరవింద్‌కు రూ.2లక్షల ఎల్‌వోసీని కాంగ్రెస్ మండలాధ్యక్షులు కందాల సమరంరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వలిశెట్టి ఇందిరా సైదులు, ఇంద్రకంటి యాదయ్య, గోదాసు మల్లయ్య, గద్దల పిచ్చయ్య, అయితగోని లక్ష్మయ్య, గద్దల ముత్తయ్య, అయితగోని పిచ్చయ్య, పొడిచేటి ఎల్లయ్య, బండారి వెంకన్న, జింక సైదులు, అయితగోని సతీష్ పాల్గొన్నారు.

నేడు తుమ్మలపల్లిలో మెగా హెల్త్ క్యాంపు

నాంపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం హైదరాబాద్ మలక్‌పేట యశోద హస్పిటల్ సౌజన్యంతో హెల్త్‌క్యాంపు నిర్వహించనున్నట్లు మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందికట్ల సరస్వతి వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య నిపుణులు డాక్టర్ వీరమనేని చేతన్‌రావుకు సొంత గ్రామం కావడం వల్ల హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీదేవి, భూదేవి ఆలయంలో పూజలు

నల్లగొండ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలో ఉన్న శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి దీపాలను వెలిగించారు. అర్చక స్వాముల ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ప్రమిదలతో దీపాలను వెలిగించారు. దీంతో ఆలయం అంతా వెలుగుల కాంతితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు పూజల్లో పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని తులసీనగర్‌లో గల భక్తాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. అర్చక స్వాములు స్వామి వారికి తెల్లవారు జాము నుంచే రుద్రాభిషేకాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. షేర్‌బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, బీట్ మార్కెట్‌లోని రామకోటి స్థూప దేవాలయంతో పాటు బ్రహ్మంగారిగుట్ట శివాలయం, పలు శివాలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు కనుల పండువగా జరిగాయి.

ఏళ్లు గడిచినా పునాదులకే పరిమితం

● పూర్తికాని చండూరు మునిసిపాలిటీ భవనం ● కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిన పనులు



పునాది దశలోనే నిలిచిన మునిసిపాలిటీ భవన నిర్మాణ పనులు

చండూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చండూరు మేజర్ గ్రామపంచాయతీని పాలనా సౌలభ్యం కోసం 2018 సంవత్సరం ఆగస్టు 13 తేదీన తెలంగాణ ప్రభుత్వం కొత్తగా మున్సిపాలిటీలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో మున్సిపాలిటీల అన్నింటిలో చండూరు మున్సిపాలిటీ అతి చిన్నది. చండూరు మునిసిపాలిటీ పరిధిలోని 10వార్డులు ఉన్నాయి. చండూరు, లకినేనిగూడెం, అంగడిపేట గ్రామాలు ఉన్నాయి. సుమారు 20వేలు జనాభా కలిగి ఉంది. గ్రామపంచాయతీగా ఉన్నప్పుడే నిర్మించిన భవనాన్ని, మునిసిపాలిటీ ఏర్పడ్డాక కూడా అదే భవనాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. జనాభా పెరిగిన దృష్ట్యా, పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు అసౌకర్యం కలుగుతుండడంతో, నూతన భవనానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మునిసిపాలిటీ కేంద్రంలో శెనగకుంట సమీపంలోనే మునిసిపల్ నూతన భవన నిర్మాణానికి 2023లోనే శంకుస్థాపన చేసినప్పటికీ, పనుల్లో పురోగతి కనిపించడం లేదు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ పిల్లర్ల దశ లోనే పనులు నిలిపివేయడంతో ఇప్పటివరకు కూడా పనులు ముందుకు సాగడం లేదు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.2కోట్లతో పనులు

మునిసిపాలిటీ కేంద్రంలో టీయూఎఫ్ఐడీసి నిధులతో శెనగకుంట సమీపంలో 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.2కోట్లతో మునిసిపల్ భవన నిర్మాణానికి నాటి మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలు శంకుస్థాపన చేశారు. అధికారుల పర్యవేక్షణ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడంలేదు. దీంతో ఇప్పుడు ఉన్న ఇరుకు గదుల్లో కార్యాలయం పనులకు వెళ్లాంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

త్వరగా పనులు పూర్తిచేయాలి



మునిసిపల్ కార్యాలయం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పనుల్లో జాప్యం లేకుండా, ప్రజాధనం వృథా కాకుండా నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించి, ప్రజలకు అందుబాటులోకి తేవాలి.

● కొత్తపాటి సతీష్, స్థానికుడు

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..
'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు. ACM - 9985411394
Nalgonda ACO - 9985410334, Nalgonda-1 ACO-9985 411407, Chandur SR - 9849337588, Chityala SR - 9010198664, Nakrekal SR - 9963624250, ,Kattangoor SR - 9963624250

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	589.70 (311.1486)	44,217	44,217
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	3936.22	3936.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.342 (44.7433)	44,650	52,086

చికెన్ ధరలు | లైవ్ : రూ.148 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250

హరహర మహాదేవ



కార్తీక వెలుగుల్లో నల్లగొండ పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయం



ఛాయా సోమేశ్వరాలయంలో కార్తీక దీపాలను కొలనులో వదులుతున్న మహిళలు



ప్రత్యేక అలంకారంలో శివలింగం

హరహర మహాదేవ శంభోశంకర అంటూ జిల్లా మార్మోగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం నుంచే ఆలయాలు కిక్కిరిశాయి. సూర్యోదయం కంటే ముందే ఆలయాలకు పోటెత్తిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఓ నమఃశివాయ అంటూ కార్తీక దీపాలు వెలిగించారు. కోరిన కోర్కెలు తీరాలంటూ దీపాలను కొలనుల్లో వదిలారు.

నిండు చందురుడి దరహాసం



భువనగిరి ఖిల్లాపైనుంచి చంద్రుడి కాంతులు

నిర్మలమైన ఆకాశంలో నిండు చందురుడి దరహాసం అబ్బురపరిచింది. పౌర్ణమి కాంతులీనుతూ కనురెప్ప వాలనీయలేదు. ఆకాశంలో ఈ సుందర దృశ్యాన్ని జిల్లా ప్రజలు ఎంతో ఆసక్తిగా తిలకించారు. బుధవారం భువనగిరి ఖిల్లా సిగలో ఆ చందమామ అందాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

షరతుల్లేకుండా ధాన్యం, పత్తి కొనాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

నకిరేకల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తడిసిన ధాన్యాన్ని, పత్తిని ఎలాంటి షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. నకిరేకల్‌లో బుధవారం జరిగిన పార్టీ నియోజకవర్గస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం, పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతుల పంటను మద్దతు ధరతో వెంటనే కొనుగోలు చేయాలన్నారు. డిసెంబరు 26వ తేదీన ఖమ్మంలో జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభలో కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీపీఐ ముగింపు సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలి పోతుందన్నారు. వందేళ్ల క్రితం ఏర్పడిన సీపీఐ ప్రజా సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిందని, తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకైన పాత్ర పోషించిందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్, గౌని లక్ష్మీనర్సయ్య, బుడిగె సైదులు, జిల్లా యాదయ్య, శంకర్, ఎండీ అక్బర్, పాల్వాయి విద్యాసాగర్, జిల్లా సత్యం, శ్రీనివాస్, ఎస్‌కే షరీఫ్, తీగల మల్లారెడ్డి, బోడ మల్లేష్, జంగయ్య, మల్లయ్య, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

కలిసి రాని కాలం

- పడిపోయిన వరి దిగుబడులు
- కోత యంత్రాల కొరతతో అవస్థలు
- ప్రకృతి వైపరీత్యాలతో కునుకు కరవు



6

పత్తి కొనుగోళ్లు షురూ..



జిల్లాలో పత్తి కొనుగోళ్లు షురూ కానున్నాయి. జిన్నింగ్ మిల్లులలో పత్తిని యథావిధిగా కొనుగోలు చేస్తామని, ఎలాంటి సమ్మె చేయబోమని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో జరిగిన సమావేశంలో జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ఒప్పుకున్నాయి. దీంతో జిల్లాలో పత్తి కొనుగోళ్లు నేటి నుంచి ఆరంభం కానున్నాయని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి -నల్లగొండ)

● సమ్మె విరమించిన జిన్నింగ్ మిల్లుల యాజమాన్యం

పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వ్యవహరిస్తున్న తీరుతోపాటు పలు నిబంధనలతో ఓ వైపు రైతులు.. మరో వైపు జిన్నింగ్ మిల్లుల యజమానులు అయోమయంలో పడ్డారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలలో అలాంట్‌మెంట్, యాప్ రిజిస్ట్రేషన్, తేమశాతం పరిమితివంటి నిబంధనలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 5.60లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఈ సారి కొంత ఆలస్యం కావడం, ఆపై కురిసిన వర్షాలతో దిగుబడులు తగ్గడం, చివరకు అకాల వర్షాలతో తడిసిన పత్తికి.. తేమశాతం పెరగడం వంటి కారణాలు రైతులను కుంగదీస్తున్నాయి. అధికారులు ఎకరానికి 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లు వస్తుందని భావించారు. మొత్తం సాగులో 57లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడి రానుందని అంచనా వేశారు. అయితే అకాల వర్షాలు రైతులను నిండా ముంచాయి. ఎకరాకు కనీసం నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లు దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. దిగుబడి తగ్గడానికి తెగులు కూడా కారణమైంది.

తిరకాసు పెడుతున్న సీసీఐ...

అసలే దిగుబడులు తగ్గి, భారీ వర్షాలు.. మొంథా తుపాన్‌తో నష్టపోయి ఆందోళనలో ఉన్న సమయంలో సీసీఐ రోజుకో నిబంధన తెచ్చి ఇబ్బందులకు గురిచేస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ వ్యవహారం జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలను సైతం ఇబ్బందులకు గురి చేసే విధంగా ఉంది. ఎల్-1, ఎల్-2, ఎల్-3 కేటగిరీలను ఎత్తివేయాలని, యాప్ రిజిస్ట్రేషన్ నిబంధనలు సడలించాలని పత్తి మిల్లుల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనికితోడు ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేయాల్సిన సీసీఐ ఏడు క్వింటాళ్ల వరకే పత్తి కొనుగోలు చేస్తామని ప్రకటించడం కూడా రైతులకు ఇబ్బందిగా మారింది. గత సీజన్‌లో ఎకరాకు 12 క్వింటాళ్లు కొనుగోలు చేసిన సీసీఐ ఈ సారి 5 క్వింటాళ్లు తగ్గించడంతో రైతులు...

- మిగతా 8వ పేజీలో...

తెల్లబోయిన పత్తి రైతు

- వర్షాలకు తగ్గిన దిగుబడి
- నల్లగా మారిన తెల్లబంగారం
- తేమ పేరుతో కొనుగోలు చేయని సీసీఐ



పెండ్లిపాకల గ్రామంలో నీట మునిగిన పత్తి

(ఆంధ్రజ్యోతి-కొండమల్లేపల్లి): భారీ వర్షాలకు పత్తి రైతులు తెల్లబోతున్నారు. వరుస వర్షాలకు పత్తి నల్లగా మారడంతో పాటు తేమ శాతం అధికంగా ఉండటంతో కొనుగోళ్లు చేయడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో పడిపోయారు. నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలవ్యాప్తంగా ఇటీవలి భారీ వర్షాలకు పత్తి పంట తీవ్రంగా దెబ్బతింది. పత్తి దిగుబడిని సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్తే తమే శాతం అధికంగా ఉందని కొనుగోలు చేయలేదని రైతులు తెలిపారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ కారణంగా పంట చేను మునిగి నల్లబారింది. మరోవైపు పత్తి ఏరేందుకు కూలీల కొరత రైతులను వేధిస్తోంది. పత్తి ఏరడానికి కిలోకు రూ20 ఇస్తామని చెప్పినా ఎవరూ రావడం లేదు. పూత దశ నుంచే పంటకు తెగులు సోకడంతో, వర్షాల ప్రభావంతో రైతుల ఆశలు నిరాశగా మారాయి. గతంలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల పత్తి వచ్చేదని, ఈ ఏడాది వర్షాలకు ఎకరానికి 7 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి కష్టంగా మారిందంటున్నారు. దీంతో పెట్టుబడులు రాక అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలు వరి పంటను దారుణంగా దెబ్బతీశాయి. కోతకొచ్చిన పంట నేలకొరిగింది.

సురక్షిత నీటి సరఫరా దిశగా..

● డ్రింక్ డైరెక్ట్ ఫ్రమ్ ట్యాప్ విధానానికి చర్యలు



ఖమ్మంలో డీఎఫ్‌టీ విధానం అమలుకు ఇంజనీర్లతో చర్చిస్తున్న మునిసిపల్ కమిషనర్(ఫైల్)

పట్టణ ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేందుకు మునిసిపల్‌అధికారులు చర్యలు చేపట్టారు. డ్రింక్ డైరెక్ట్ ఫ్రమ్ ట్యాప్ విధానం ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విధానంలో తొలుత నీటిని మరిగించిన అనంతరం ఫిల్టర్ చేసి సరఫరా చేస్తారు.

- (ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణ ప్రజలకు కృష్ణా జలాలను మునిసిపల్ కుళాయిలు, మిషన్ భగీరథ నల్లాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఆ నీటిలో కలుషితాలను నివారించడంతోపాటు ఆరోగ్యానికి అవసరమైన మినరల్స్‌ను కలిపేందుకు మునిసిపల్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి మునిసిపాలిటీకి మంజూరైన రూ. 16.70కోట్లలో డీడీఎఫ్‌టీ విధానానికి రూ.1.70కోట్లు కేటాయించినట్లు సమాచారం.

డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానం..

డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానం దేశంలోని మెట్రో పాలిటన్ సిటీల్లో అమలవుతోంది. ఒడిశా రాష్ట్రంలో డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ మిషన్ పేరుతో తాగునీటి సరఫరా జరుగుతోంది. భువనేశ్వర్, కటక్ నగరాల్లో డ్రింక్ ఫ్రమ్ ట్యాప్ విధానంలో నీటిని సరఫరా చేస్తున్నారు. దేశంలో ఇప్పటికే ఎనిమిది నగరాల్లో 2.5 మిలియన్ జనాభాకు డీఎఫ్‌టీ విధానంలో డ్రింకింగ్ వాటర్ అందుతుండటం గమనార్హం.కాగా రాష్ట్రంలోని కరీంనగర్, ఖమ్మం పట్టణాల్లో డ్రింక్ డైరెక్ట్ ఫ్రమ్ ట్యాప్ విధానం అమలుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనేపథ్యంలో ఖమ్మంలో జరుగుతున్న డీఎఫ్‌టీ విధానాన్ని కమిషనర్ శ్రీనివాస్ మునిసిపల్, మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో కలిసి పరిశీలించారు.

నిర్వహణ కష్టతరమే..

డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానం అమలు కష్టతరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు సీజన్లకు అతీతంగా నీటి నిల్వలు సమృద్ధిగా ఉండాలి. అదనపు మోటార్ పంపులు, హౌస్‌హోల్డ్ ఫిల్టర్లు అవసరముంటాయి. నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయడంతోపాటు, అదనపు ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించాల్సి ఉంటుంది. 24/7 నీటి సరఫరాలో మంచినీటి వృథా జరుగుతుందని, అందుకు ప్రతి ఇంటికీ వాటర్ మీటర్లు బిగించాల్సి ఉంటుంది. నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచాల్సిన అవసరముంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఖమ్మంలో పర్యటించాం

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్‌లో అమలవుతున్న డ్రింక్ ఫ్రమ్ ట్యాప్(డీఎఫ్‌టీ) విధానాన్ని ఇంజనీర్ల బృందంతో కలిసి పరిశీలించాం. పట్టణ ప్రజలకు సురక్షితమైన మంచి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు పక్షంరోజుల్లో స్పెషల్ టీమ్ పట్టణానికి వచ్చి పరిశీస్తుంది. సమగ్ర నివేదిక రూపొందించిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తాం.



జీ. శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

చెర్వుగట్టులో గిరి ప్రదక్షిణ ప్రారంభం

- వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు
- కార్యరూపానికి పూర్వ అర్చకుడు పోతులపాటి సోమశర్మ సంకల్పం



వీహెచ్‌పీ ఆధ్వర్యంలో చెర్వుగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నార్కట్‌పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం గిరి ప్రదక్షిణ ప్రారంభమైంది. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కాకుండా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ గిరిప్రదక్షిణను కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రారంభించారు. రాజగోపురం మెట్ల మార్గం వద్ద ఉన్న నంది సర్కిల్ నుంచి గిరిప్రదిక్షణను దేవస్థాన ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. దేవునిబావి, నల్లచెర్వు కట్ట మీదుగా అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారికి చేరుకున్నారు. అక్కడి నుంచి ఎల్లారెడ్డిగూడెం బస్టేజీ వద్ద ఉన్న ఆర్చి వరకు వెళ్లి చెర్వుగట్టు గ్రామానికి వెళ్లే రోడ్డు ద్వారా నడక సాగిస్తూ పార్వతీ అమ్మవారి గుడి ముంగిట నుంచి తిరిగి మెట్ల మార్గం రాజగోపురం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఘాట్‌రోడ్డు మీదుగా గుట్టపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ గిరిప్రదక్షిణ ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన వీహెచ్‌పీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట భానుప్రసాద్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గిరిప్రదక్షిణకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. హిందూ సంస్కృతిని, సంప్రదాయాలను, క్షేత్ర ప్రాశస్త్యాన్ని ఇనుమడింపజేసేలా రానున్న రోజుల్లో గిరిప్రదక్షిణ కొనసాగనుందని ఆకాంక్షించారు. కాగా చెర్వుగట్టు దేవస్థానంపై వసతుల కొరత తీవ్రంగా ఉందని, భక్తులకు కనీస వసతులు కల్పించలేని దుస్థితిలో ఆలయ అధికారులు, ఎండోమెంట్ వ్యవస్థ ఉందని ఆరోపించారు. కాగా ప్రతీ పౌర్ణమి, అమావాస్య తిథుల్లో నెలకు రెండు పర్యాయాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించామని గిరిప్రదక్షిణకు నాయకత్వం వహించిన వీహెచ్‌పీ ధర్మాచార్య సంపర్క్ విభాగ్ నల్లగొండ జిల్లా శాఖ అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కర్నాటి యాదగిరి, యెలిజాల నర్సింహ్మ, వెంకటయ్య, సంపత్, రమేశ్, వెంకట్‌రెడ్డి, యాదగిరి, అశోక్,చిట్టి, శంకర్ పాల్గొన్నారు.

కార్యరూపంలోకి సోమశర్మ సంకల్పం



(ఫైల్)

చెర్వుగట్టు దేవస్థాన అనువంశిక పూర్వ విశ్రాంత అర్చకుడు.. పుట్టుకతోనే అంధుడైన దివంగత పోతులపాటి సోమశర్మ గిరిప్రదక్షిణ సంకల్పం కాస్త ఆలస్యమైనా కార్యరూపం దాల్చింది. చెర్వుగట్టులో గిరిప్రదక్షిణ ఉత్సవం నిర్వహించాలని వికారి నామ సంవత్సరం 2020 జనవరి 22,23 తేదీల్లోనే అంకురార్పణ చేశారు. అయితే దేవస్థానం ఆధ్వర్యంలో కాకపోగా వీహెచ్‌పీ చేపట్టిన గిరిప్రదక్షిణ కార్యక్రమంతో సోమశర్మ సంకల్పం ఈ విధంగానైనా నెరవేరిందని ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్లేష్



సమావేశంలో మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయితీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయితీ పరిధిలోని ప్రజలకు అన్నిరకాల సేవలను అందిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలతో చాలీచాలనీ జీతంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. శ్రమకు తగిన వేతనాలు అందించాలని, యూనియన్ తరఫున అనేక మార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. మరోవైపు కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వాలు రోజుకు ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటలపాటు పని చేయిస్తున్నాయన్నారు. పెరిగిన ధరల దృష్ట్యా ప్రభుత్వం వేతనాలు పెంచాలన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారంకోసం ఉద్యమాలను చేపట్టాలన్నారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, గ్రామపంచాయతీ వర్కర్ల యూనియన్ నాయకులు జిల్లా సైదులు, బుచ్చయ్య, శ్రీనివాసరెడ్డి, దుర్గయ్య, నిమ్మల కోటి సైదులు, రవి, కోటయ్య, శ్రీను, మంద ఏసు, సైదులు, శివ, వీరయ్య, వెంకన్న, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు పైపైకి



సూర్యాపేటటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తోన్న వర్షాల ప్రభావం కూరగాయల ధరపై పడింది. మొంథా తుపాన్‌తో వరి, పత్తి పంటలతో పాటు కూరగాయల పంటలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో కూరగాయల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 15 రోజుల నుంచి కూరగాయల ధరలు రోజురోజుకూ పెరుగుతుండడంతో మధ్యతరగతి, పేద ప్రజలు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. కుటుంబానికి సరిపోను కూరగాయల కోసం రూ.400 ఖర్చు చేసినా మూడు రోజులకు కూడా సరిపోవడంలేదు. దీనికి తోడు కార్తీకమాసం కావడంతో ఎక్కువగా శాఖాహారం తింటుండటం, వివిధ మాలల ధారులతో వినియోగం పెరిగింది. పెరిగిన ధరలతో కొనాలన్నా ఒకటికీ రెండుసార్లు ఆలోచించుకునే పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వారసంతల్లోనూ కూరగాయల ధరలు మండిపోతున్నాయి.సూర్యాపేట మార్కెట్‌కు చివ్వెంల, ఆత్మకూరు(ఎస్), పెన్‌పహాడ్ మండలాలతో పాటు నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం, హైదరాబాద్, విజయవాడ, ఖమ్మం ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతాయి. తుపాన్ ప్రభావంతో పంటలుదెబ్బతినడంతో దిగుబడి తగ్గి ధరలు పెరుగుతున్నాయి.

భగ్గుమంటున్న ఉల్లి ధర

ఉల్లి ధరలు భగ్గుమంటున్నాయి. గతంలో రూ.20 నుంచి 25లోపు ఉన్న ధర 15రోజుల నుంచి రూ.35దాకా చేరుకుంది. మహారాష్ట్ర నుంచి రాష్ట్రానికి అత్యధికంగా ఉల్లిగడ్డ ఎగుమతి అవుతుంది. ఎగువన వర్షాలకు తోడు ఉల్లి సాగు లేకపోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దామరచర్ల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11కేవీ వీర్లపాలెం పరిధిలో విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నందున నేడు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వీర్లపాలెం గ్రామ, వీర్లపాలెం అగ్రికల్చర్ ఫీడర్ల పరిధిలోని అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ బుధవారం తెలిపారు. గృహ, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

చంద్రబాబుపై మాజీమంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి జగదీష్‌రెడ్డి అవివేకంతో మాట్లాడుతున్నారని టీడీపీ ఓబీసీ విభాగ రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్ అన్నారు. బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు విషయమై మాట్లాడిన జగదీష్‌రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు పేరును పదేపదే తీసుకురావడం సరికాదన్నారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ అబద్ధపు మాటలు, అమలుకు సాధ్యం కాని ప్రచారాలతో కాలం వెళ్లదీసిందన్నారు.



కార్తీక శోభ

దేవాలయాలు వెలుగులతో కొత్త శోభ సంతరించుకున్నాయి. బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి దీపాలు వెలిగించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలి రావడంతో సందడి నెలకొంది.

వాడపల్లి కృష్ణా, మూసీ నదుల సంగమం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



దేవరకొండలో

నాగార్జునసాగర్‌లో



హాలియాలో..



చింతపల్లిలో...



అయ్యప్ప స్వామి దేవాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు



గుర్రంపోడు: చామలేడు శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



దేవరకొండ: హోమం, గీతా పారాయణంలో పాల్గొన్న భక్తులు

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని జిల్లా సహకార అధికారి పత్యానాయక్ అన్నారు. మండలంలోని పీఏపల్లి, అంగడిపేట ఎక్స్‌రోడ్డు, గుడిపల్లి మండలంలోని గుడిపల్లి, ఘనపురంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పాటించి 17శాతం తేమ కలిగిన గ్రేడ్-ఏ రకానికి రూ.2,389. గ్రేడ్-బి రకానికి రూ.2369 ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతులు ధాన్యాన్ని తమ పొలం వద్దనే ఆరబెట్టుకొని తాలు, మట్టి పెల్లలు లేకుండా తీసుకురావాలన్నారు. రైతులు వరి ధాన్యంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం తప్పనిసరిగా జీరాక్స్ తీసుకురావాలన్నారు. రైతు ఆధార్‌నెంబర్ సెల్‌ఫోన్ నెంబర్‌కు లింక్ చేసుకోవాలని సూచించారు. కేంద్రాల్లో నిర్వహకులకు ప్రతిరోజూ మ్యాచర్ చూసి ఎప్పటికప్పుడు ధాన్యం లారీలలో లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, సీఈవో మద్దిమడుగు ప్రభాకర్, మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్లు మద్దిమడుగు అచ్యుత్‌కుమార్, చాట్ల అంజమ్మఇద్దయ్య, మార్కెట్ డైరెక్టర్లు మేకల దీప్తివెంకటయ్య, భూతం సైదులు, రేషన్ డీలర్ల అధ్యక్షుడు రమావత్ శ్రీనునాయక్, పాండునాయక్, వడ్లపల్లి చంద్రారెడ్డి, కుశలయ్య, వడ్లపల్లి రవీందర్‌రెడ్డి, గండు సాలయ్య, యాదయ్య, మహేష్, నాగేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార శాఖ అధికారి పత్యానాయక్

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి



మాట్లాడుతున్న ఎస్ఐ సాయిప్రశాంత్

హాలియా, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని హాలియా ఎస్ఐ. సాయిప్రశాంత్ అన్నారు. అనుముల మండలం మదారిగూడెం గ్రామంలో తూళ్ల పాపయ్య జ్ఞాపకార్థం జిల్లా జూనియర్ కబడ్డీ బాల బాలికల ఎంపిక పోటీల్లో మాట్లాడారు. క్రీడల ద్వారా యువకుల్లో శారీరక ధారుఢ్యానికి, మానసిక ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. క్రీడల ద్వారా వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలు మెరుగవుతాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని నేటి ఓటమి రేపటి గెలుపుకు పునాది అని అన్నారు. కార్యక్రమంలో చందంపేట ఎస్ఐ. లోకేష్‌యాదవ్, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధి ముచ్చర్ల ఏడుకొండలు, జిల్లా అధ్యక్షుడు భూలోకరావు, జిల్లా కార్యదర్శి కర్తయ్య, జాయింట్ సెక్రటరీ డొనిమిక్, చంద్రయ్య, వీరాసింగ్, నిరంజన్, అమీర్‌అలీ, తూళ్ల ఉదయరాజు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని ఆదర్శనగర్ డబుల్ బెడ్‌రూం కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ రహీం ఇటీవల మృతిచెందాడు. కాగా బుధవారం నిరుపేద కుటుంబానికి చెందిన ఆ ఇంటి యజమాని రహీం మృతి చెందడంతో దేవరకొండ లోకల్ ఆటో యూనియన్ నాయకులు రూ.12వేలు రహీం కుమారుడికి అందజేసి మాట్లాడారు. రహీం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు మంగలగిరి రమేష్, ఖాదర్ కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కొర్ర భీంసింగ్, చంద్రయ్య, ఖాదర్, యాదగిరి, వలి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కౌండిన్య మహర్షి అడుగుజాడల్లో నడవాలి



కౌండిన్య మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కౌండిన్య మహర్షి అడుగుజాడల్లో నడవాలని గౌడ సంఘం నాయకుడు గుండు శ్రీరాములు గౌడ్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కౌండిన్య మహర్షి జయంతి నిర్వహించారు. గౌడ వంశ మూల పురుషుడైన కౌండిన్య బుద్ధ భగవానుడి సహచరుడిగా సేవలందించి, రెండో బుద్ధుడిగా పేరు గడించారన్నారు. బూర్జువా వ్యవస్థ నిర్మూలను కృషిచేసిన కౌండిన్య మహర్షి శాంతి, కరుణ చూపారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గంగావరప్రసాద్, పుట్ట ధర్మయ్య, ఎస్. ఉదయభాస్కర్‌గౌడ్, రాచకొండ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

మిర్యాలగూడ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ శాసనసభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయాన్ని కాంక్షిస్తూ యాదవ సంఘం నాయకులు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఎన్నెస్పీ గ్రౌండ్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా యాదవ సామాజిక వర్గం నేతలు సమావేశమై సుమారు 80 వాహనాల్లో హైద్రాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పగిడి రామలింగం యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల్లో నవీన్‌యాదవ్‌ను గెలిపించడం ద్వారా బీసీ ఐక్యతను దేశానికి చాటాలన్నారు. మునుముందు చట్టబద్ధంగా 42శాతం బీసీ రిజర్వేషనలను సైతం సాధించుకోగలమన్నారు. హైద్రాబాద్‌కు తరలివెళ్లిన వారిలో యాదవ సంఘం నాయకులు పొదిల వెంకన్న, కట్టెబోయిన రామలింగం యాదవ్, పుట్టపాక శ్రీనివాస్, కంచుగట్ల లింగయ్య, జంగా లక్ష్మణ్, మురళీ, గాలం వెంకన్న, కట్టెబోయిన శ్రీనివాస్, సంద్రాల వెంకన్న ఉన్నారు.



హైదరాబాద్‌కు బయలుదేరుతున్న యాదవ సంఘం నాయకులు

శిశు విక్రయాలు చట్ట విరుద్ధం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ

నేరేడుగొమ్ము, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, శిశు విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ సీడీపీవో కె. చంద్రకళ హెచ్చరించారు. బాల్యవివాహాలు, అక్రమదత్తత, శిశు విక్రయాలపై మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లకు బుధవారం అవగాహన కల్పించారు. 18సంవత్సరాలు నిండే వరకు ఆడపిల్లలకు పెళ్లి చేయకూడదన్నారు. బాల్య వివాహాలు జరిగితే 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. దత్తత ఇవ్వాలంటే ప్రభుత్వం ద్వారా పిల్లలులేని దంపతులు చట్టపరమైన ప్రక్రియ ద్వారా పిల్లలను దత్తత తీసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ, కస్తూర్బ ఎస్.వో శ్వేత, శబవాణి, వనిత, భార్గవి, నాగజ్యోతి, లక్ష్మీ పాల్గొన్నారు.



అధ్వానంగా గ్రామీణ రహదారులు

గుర్రంపోడు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అద్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా మండలంలోని కొప్పోలు నుంచి బొల్లారం వెళ్లే రోడ్డు, గుర్రంపోడు నుంచి పిట్టలగూడెం వెళ్లే రోడ్డు బీటీ రోడ్డంతా కంకర దేలి గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై ఏర్పడిన గుంతలలో నీరు నిలిచి నీటి మడుగులను తలపిస్తున్నాయి. రాత్రి సమయంలో ఈ మార్గంలో వెళ్లాలంటేనే ఆయా గ్రామాల ప్రజలు జంకుతున్నారు. గుంతల విషయం తెలియని కొత్తగా గ్రామాలకు వస్తున్న అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకొని రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న కొప్పోలు నుంచి బొల్లారం వెళ్లే రోడ్డు



పత్తి కొనుగోళ్లు షురూ

(5వ పేజీ తరువాయి)

అయోమయానికి గురవుతున్నారు. సీసీఐ నిబంధనలు జిన్నింగ్ మిల్లుల వ్యవస్థనే సవాలు చేసే విధంగా మారడంతోపాటు చివరికి జిన్నింగ్ పరిశ్రమ మూతపడే ప్రమాదం ఉందన్న వాదన వినిపిస్తుంది. మిల్లుల ఉనికిని సవాల్‌చేసే విధంగా సీసీఐ వ్యవహరిస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. ఎల్-1, ఎల్-2, ఎల్-3 వాదనతో జిన్నింగ్ మిల్లుల వ్యవస్థకు విఘాతంగా మారిందన్న చర్చ సాగుతుంది.

వానాకాలంలో తీవ్ర నష్టం

జిల్లాలో ఈ వానాకాలంలో పత్తి రైతులు తీవ్ర నష్టాన్ని చవి చూశారు. ప్రతీ ఎకరాకు ఒక్కో రైతు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టారు. వచ్చిన పత్తి దిగుబడులను చూస్తే పెట్టిన పెట్టుబడులు కూడా వస్తాయో? లేదో? అన్న సందేహాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతోపాటు మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో 25,919 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. ఇందులో అత్యధికంగా దేవరకొండ నియోజకవర్గంలో 18,830 ఎకరాల్లో పత్తి దెబ్బతినగా, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 2,814 ఎకరాలు, మిర్యాలగూడ నియోజకర్గంలో 65 ఎకరాలు, మునుగోడు నియోజకవర్గంలో 1,350 ఎకరాలు, నకిరేకల్ నియోజకవర్గంలో 2,721 ఎకరాలు, నల్లగొండ నియోజకవర్గంలో 139 ఎకరాల పంట దెబ్బతింది.

తేమశాతంతో కొనుగోళ్లపై ప్రభావం

గత నెల 24వ తేదీన తొమ్మిది జిన్నింగ్ మిల్లులలో కొనుగోళ్లు ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 23 ఉండగా, కేటగిరీల ప్రకారం ప్రస్తుతం కొనుగోలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు కేవలం 6,476 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. తరచుగా వర్షాలు వస్తుండటంతో పత్తి తడిసిపోయి తేమ శాతం పెరిగి విక్రయించే వీలు లేకుండాపోతుంది. పత్తిలో తేమశాతం 8నుంచి 12శాతం కంటే ఎక్కువగా ఉంటే కొనుగోలు చేసే పరిస్థితి లేదని సీసీఐ స్పష్టం చేయడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తేమశాతం 25వరకు ఉన్నా కూడా కొనుగోలు చేస్తే రైతులు గట్టెక్కే పరిస్థితి ఉంది. కానీ తేమశాతం కొనుగోళ్లపై ప్రభావం చూపిస్తుంది. అదేవిధంగా సీసీఐ కొత్తగా ప్రవేశపెట్టిన కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ తప్పనిసరి చేసింది. అయితే రైతుల వద్ద చాలా మందికి స్మార్ట్‌ఫోన్ లేకపోవడం, ఉన్న వారికి అవగాహన లేకపోవడంతో ఆ యాప్‌లో నమోదు చేయలేక పోతున్నారు. దీంతో పాటు మద్దతు ధరపై కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాణ్యమైన పత్తికి క్వింటాకు రూ.8,110 చెల్లిస్తామని చెప్పినా, ప్రస్తుతం అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. అప్పు తెచ్చి మరీ రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టా. ప్రస్తుతం పత్తి ఏరడానికి కూలీలు దొరకడం లేదు. కూలీలకు కిలో రూ.20 ఇస్తామన్నా ఎవరూ రావడం లేదు. దీంతో పాటు వర్షాల కారణంగా పంటకు తెగులు సోకి నల్లగా మారింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాక అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి ఉంది. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

● గుండాల మల్లయ్య, పెండ్లిపాకల.



ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో..
'ఆంధ్రజ్యోతి'కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! పత్రిక పంపిణీలో ఏమైనా అసౌకర్యం ఎదురైందా! మాకు సమాచారమివ్వండి.. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు. సంప్రదించగలరు : మిర్యాలగూడ, దేవరకొండ, హాలియా
ACM - 9985411394 Miryalguda ACO - 9963624250, Miryalguda SR - 9542690885, Devarkonda SR - 9392062350, Haliya SR - 9885226544